# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :195 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 10-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

న్యూఢిల్లీ,రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు 2025కు గాను నోబెల్ బహుమతి లభించింది. మెటల్–ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అభివృద్ధి చేసినందుకు గాను సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎమ్ యాఘీలకు నోబెల్ బహుమతిని అందించనున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. వీరు కొత్త రకం మాలిక్యూలర్ ఆర్కిటెక్చర్ అభివృద్ధి చేసినట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. గతేడాది కూడా రసాయన శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి లభించింది. ప్రొటీన్లపై విశేష పరిశోధనలు చేసిన డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లు ఈ పురస్కారం అందుకున్నారు. కాగా, ఈ ఏడాది ఇప్పటికే వైద్య శాస్త్రంలో బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్, డాక్టర్ షికోమ్ సకాగుచీకి నోబెల్ బహుమతి ఎంపికయ్యారు. అలానే భౌతిక శాస్త్రంలో జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టినిస్, మైఖేల్ హెచ్ డెవొరెట్‌ను నోబెల్ కమిటీ ప్రకటించింది. గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి, అక్టోబర్ 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటిస్తారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు.

## తొలి విడత ఎంపీటీసీ.. జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల..




హైదరాబాద్,తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. రెండు విడుతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో తొలి విడుత ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల అయ్యింది. నేటి నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఈ నెల 11న నామినేషన్లకు చివరి తేదీ. ఈనెల 12న నామినేషన్ల పరిశీలన ఉండగా.. ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈనెల 23న మొదటి విడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో గ్రామాల్లో హడావుడి మొదలైంది. మొదటి విడతలో 292 జడ్పీటీసీ, 2963 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎంపీటీసీలకు మండల కార్యాలయాల్లో, జడ్పీటీసీ అభ్యర్థులకు జిల్లా కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తున్నారు. మిగితా స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. కాగా రెండో విడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ అక్టోబర్ 27న జరగనుంది. దీనికి సంబంధించి అక్టోబర్ 13న నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబర్ 16న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 19 వరకు నామినేషన్ల విత్ డ్రాకు అవకాశం కల్పించారు. నవంబర్ 11న రెండు విడతలకు సంబంధించిన ఫలితాలు వెల్లడికానున్నాయి.

ఎన్నికల ఖర్చు లిమిట్ ఎంతంటే..

ఇదిలా ఉండగా ఎన్నికల సంఘం అభ్యర్థుల ఖర్చు పరిమితిని కూడా ఖరారు చేసింది. జెడ్పీటీసీ అభ్యర్థి రూ. 4 లక్షలు ఖర్చు చేయవచ్చు. ఎంపీటీసీ అభ్యర్థి రూ. 1.50 లక్షల వరకు ఖర్చు చేయడానికి వీలుంటుంది. ఇక సర్పంచ్ అభ్యర్థి గరిష్టంగా రూ. 2.50 లక్షలు ఖర్చు చేయొచ్చు. ఈ నిబంధనలు దాటితే అభ్యర్థులు మూడేళ్లపాటు పోటీకి అనర్హులు అవుతారు లేదా గెలిచినా పదవిని కోల్పోతారు. అభ్యర్థులు ఎన్నికల ఫలితాలు వెల్లడైన తేదీ నుంచి 45 రోజులలోపు ఖర్చుల తుది నివేదికను సమర్పించాలి.

## ఆర్టీసీ ఎండీని కలిసిన కేటీఆర్ బృందం.. బస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్

హైదరాబాద్: సిటీ బస్సులో పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ 'చలో బస్ భవన్' కార్యక్రమాన్ని బీఆర్ఎస్ చేపట్టింది. తీవ్ర నిర్బంధాల నడుమ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, వాణి దేవి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, లక్ష్మారెడ్డి, పార్టీ నేతలు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి బస్ భవన్ చేరుకున్నారు. అనంతరం టీజీఎస్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కేటీఆర్, హరీశ్, సబిత, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు భేటీ అయ్యారు. గ్రేటర్ పరిధిలో పెంచిన ఆర్టీసీ చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ తరఫున లేఖ అందజేశారు. ప్రభుత్వ బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ. 1353 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆర్టీసీ ఎండీ బీఆర్ఎస్ నేతలకు తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ. 9246 కోట్ల ఆర్టీసీ గ్రాంట్‌ను విడుదల చేశారని ఆర్టీసీ ఎండీకి కేటీఆర్ తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని ముంచేలా కనబడుతున్నదని ఆరోపించారు. మొత్తంగా సంస్థను ప్రైవేటుకు అప్పగించే కుట్ర చుస్తున్నదని చెప్పారు. పెంచి బస్ చార్జీలను తగ్గించాలని చెప్పారు. 1353 కోట్లు 'మహాలక్ష్మి' పథకం బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని స్వయంగా తెలిపిన ఆర్టీసీ ఎండీ



బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని కలిసి ప్రతిపాదన అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

## హౌస్ అరెస్టులు.. మీడియాపై ఆంక్షలు పెట్టడమేనా ఇందిరమ్మ పాలన అంటే

హైదరాబాద్: ఇందిరమ్మ పాలన అంటే హౌస్ అరెస్టులు, మీడియాపై ఆంక్షలు పెట్టడమా అని రేవంత్ రెడ్డి సర్కార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, పురుషులకు బస్ టికెట్ డబుల్ చేశారని విమర్శించారు. పండుగలంటూ అడ్డదిడ్డంగా డబుల్ చార్జీలు వసూలు చేశారంటూ ధ్వజమెత్తారు. ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచితే ప్రజలు మెట్రో రైలు ఎక్కుతారని చూస్తున్నారా అని నిలదీశారు. చలో బస్ భవన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బస్ చార్జీల పెంపుపై బస్సుల్లో బస్ భవన్‌కు వెళ్లి ఆర్టీసీ ఎండీకి పిటిషన్ ఇవ్వాలనుకున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాంతియుతంగా కార్యక్రమం చేపట్టాం. ఇంతదానికే హౌస్ అరెస్టులు, అక్రమ అరెస్టులు చేయడం ఎందుకు అని ప్రశ్నించారు. తెల్లవారు జామునుంచే తమ నాయకులను ఎందుకు అరెస్టు చేస్తున్నారని నిలదీశారు. హౌస్ అరెస్టులు, అక్రమ అరెస్టులు రేవంత్ రెడ్డి నిరంకుశత్వానికి నిదర్శమని చెప్పారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన ఇలాంటి చర్యలు ఖండిస్తున్నాం. ఇందిరమ్మ పాలన అంటే హౌస్ అరెస్టులు.. మీడియాపై ఆంక్షలు పెట్టడమా అని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి వచ్చిన 22 నెలల్లోనే ఐదుసార్లు బస్ చార్జీలు పెంచారు. మహిళలకు ఫ్రీ ఇచ్చి పురుషులకు బస్ టికెట్ డబుల్ చేశారు. పండుగలంటూ అడ్డదిడ్డంగా డబుల్ చార్జీలు వసూలు చేశారు. బస్ పాసులు తీసుకోవాలనుకుంటే వాటి ధరలనూ పెంచారు. రైతులకు విత్తనాల ధరలు పెంచి, రుణమాఫీ చేయలేదు. ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచితే మెట్రో రైలు ఎక్కుతారని చూస్తున్నారా అని ప్రశ్నించారు. తమ హయాంలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి రూ. 9 వేల కోట్లు గ్రాంటుగా ఇచ్చాం. మహాలక్ష్మి కింద ఇవ్వాల్సిన డబ్బులు సైతం ఈ ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పీఎఫ్ డబ్బులు ఇవ్వడం లేదు. మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్నారు. రేవంత్ రెడ్డి ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్ర కనబడుతున్నది. ఎలక్ట్రిక్ బస్సులు వస్తే ఆర్టీసీ డ్రైవర్లు ఎవరూ ఉండరు. కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు ఎలక్ట్రిక్ బస్సులను కట్టబెట్టాలని చూస్తున్నారు. ఎంతో చరిత్ర ఉన్న ఉప్పల్, మియాపూర్ వర్క్‌షాపులను అమ్మేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఆర్టీసీని కుదువపెడుతూ, ఆస్తులు అమ్ముకుంటున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసింది. కార్గో వ్యవస్థను తెచ్చి కేసీఆర్ ఆర్టీసీని లాభాల బాట పట్టించారు. రాహుల్ మాటల్లోనే రాజ్యాంగ రక్షణ.. రేవంత్ పాలనలో రాజ్యాంగ భక్షణ. కార్గోను అడ్డికి పావుసేరుకు రేవంత్ అనత అనుయాయులకు కట్టబెడుతున్నారు. ఆర్టీసీ బాగుపడటం రేవంత్ రెడ్డికి ఏమాత్రం ఇష్టం లేదు. ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం. పేద ప్రజలపై భారం వేసి వారి నడ్డి విరిచే పనులు మానుకోండి. టోల్‌గేట్, పండుగల పేరుతో జరుగుతున్న దోపిడీని ఉపసంహరించుకోవాలి. ఆర్టీసికి ఇవ్వాల్సిన గ్రాంట్లు ఇచ్చి సంస్థను ఆదుకోవాలి. ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గే వరకు మా పోరాటం ఆగదు. వివిధ రూపాల్లో నిరసన తెలుపుతూనే ఉంటాం.



## సుప్రీంకోర్టులోకి ఆ న్యాయవాది ఎంట్రీ రద్దు



న్యూఢిల్లీ,సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై ఓ న్యాయవాది చెప్పుతో దాడి చేసేందుకు యత్నించిన ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనను పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇక సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్ ని సస్పెండ్ చేస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యాయవాది రాకేశ్ కిశోర్‌కు సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ షాక్ ఇచ్చింది. రాకేష్ సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటూ సుప్రీంకోర్టు ప్రాంగణంలోకి ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. సీజేఐపై న్యాయవాది రాకేశ్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై.. పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. ఈనెల 6వ తేదీన ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా సీజేఐ జస్టిస్ గవాయ్‌పై ఓ న్యాయవాది బూట్ విసిరేందుకు ప్రయత్నించాడు. లాయర్లు కేసుల గురించి ప్రస్తావిస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. న్యాయవాది రాకేశ్ కిశోర్ వేదిక వద్దకు వెళ్లి తన బూట్‌ను తీసి సీజేఐపైకి విసిరేందుకు ప్రయత్ని ంచాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి అతడిని అడ్డుకొని అక్కడి నుంచి తరలించారు. ఈ సమయంలో అతడు 'సనాతన ధర్మానికి అవమానాన్ని సహిం చం' అని గట్టిగా అరిచారు. అయితే దీనిపై సీజేఐ గవాయ్ చలించకుండా వాదనలు కొనసాగించాలని న్యాయవాదులను కోరారు. 'ఇలాంటి వాటితో కలవరపడకండి. మేం కలవరపడలేదు. ఇలాంటివి నన్ను ప్రభావితం చేయవు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై కోర్ట్ భద్రతా యూనిట్ విచారణ ప్రారంభించింది.

## పంతం నెగ్గించుకున్న రేవంత్.. నవీన్ యాదవ్ కే జూబ్లీహిల్స్ టికెట్..



హైదరాబాద్,కాంగ్రెస్‌లో ఏ విషయమైనా అంత తేలిగ్గా తేలదు. వడపోతలు ఎక్కువగా ఉంటాయి. కానీ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో హైకమాండ్.. ఫటాఫట్ తేల్చేసింది. కారణం రేవంత్ రెడ్డే. ఆశావహుల్లో హేమాహేమీలు ఉండగా.. నవీన్ యాదవ్‌కే టికెట్ ఎందుకిచ్చారు? జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు తమ అభ్యర్థిగా వి.నవీన్ యాదవ్‌ను కాంగ్రెస్ ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనం రేపింది. 41 ఏళ్ల వయస్సున్న ఈ బీసీ నేత, గతంలో MIM టికెట్‌పై 2014లో, స్వతంత్రంగా 2018లో పోటీ చేసి మంచి ఓటు బ్యాంకును సంపాదించాడు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ యువకుడికి ప్రాధాన్యం ఇవ్వడం, పార్టీలోని సీనియర్ నాయకుల్ని పక్కకు పెట్టడం హాట్ టాపిక్ అయ్యింది. టీమిండియా మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్, బొంతు రామ్మోహన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, సీఎన్ రెడ్డి, పీజేఆర్ కూతురు విజయా రెడ్డి వంటి కీలక నాయకులను ఫిల్టర్ చేసి.. వాళ్లెవరినీ కాకుండా.. ఓ కుర్రాడికి టికెట్ ఇప్పించడం ద్వారా రేవంత్ రెడ్డి.. పార్టీలో తన పట్టును మరోసారి నిరూపించుకున్నారనేది విశ్లేషకులు అంచనా. ఈ నిర్ణయం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో జరిగింది. ఐతే.. అభ్యర్థి ఎవరైనా గెలిపించే బాధ్యత అంతిమంగా రేవంత్‌పై ఉంటుంది కాబట్టి.. ఆయన నిర్ణయాన్ని హైకమాండ్ ఫైనల్ చేసింది. నవంబర్ 11న జరిగే ఈ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే నవీన్ యాదవ్ కార్యాలయంలో ఉత్సవాలు జరిగాయి. పార్టీ కార్యకర్తలు అతన్ని అభినందిస్తూ, జూబ్లీహిల్స్‌లో విజయం ఖాయమని ధైర్యంగా చెప్పుకున్నారు. రేవంత్ రెడ్డి కొన్ని రోజులుగా సీనియర్ నాయకులతో వర్చువల్ సమావేశాలు నిర్వహించారు. అయినప్పటికీ నవీన్ యాదవ్‌ను మాత్రమే ఎంపిక చేశారు. అజారుద్దీన్‌లాంటి జాతీయ స్థాయి నేత, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ పీసీసీ లీడర్ కుమార్తెగా ప్రభావవంతమైన విజయా రెడ్డి, బలమైన కుటుంబ నెట్‌వర్క్ ఉన్న అంజన్ కుమార్ యాదవ్ వంటి స్థానిక నాయకుల్ని పక్కన పెట్టడంపై పార్టీలో అసంతృప్తిని ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డి తన నిర్ణయంలో దృఢంగా ఉన్నారు.

అసలు నవీన్ యాదవ్ ఎవరు?:

జూబ్లీహిల్స్‌లో బలమైన మార్క్ వేసుకున్న ఈ యువ నేత, 2014లో MIM టికెట్‌పై పోటీ చేసి 41,656 ఓట్లతో రెండో స్థానంలో నిలిచాడు. 2018లో బీఆర్ఎస్ హవా ఉన్నప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా దిగి 18,817 ఓట్లు (12.2 శాతం) సంపాదించి మూడో స్థానంలో నిలిచాడు. ఈ రికార్డు ఆధారంగానే రేవంత్ రెడ్డి ఇతన్ని ఎంపిక చేసినట్టు సమాచారం. అయితే, నవీన్ యాదవ్‌కి వివాదాస్పద నేతగా కూడా పేరుంది. ఉపఎన్నికల ముందు తప్పుడు ఓటర్ ఐడీ కార్డులు పంపిణీ చేసిన ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం పార్టీలో కొంత చర్చనీయాంశమైనప్పటికీ, కాంగ్రెస్ హైకమాండ్ దీన్ని పక్కకు పెట్టి అతనికి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం తెలంగాణ కాంగ్రెస్‌లో యువతకు ప్రాధాన్యం ఇచ్చే సంకేతంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి తన పొలిటికల్ స్ట్రాటజీలో యంగ్ బ్లడ్‌ను ప్రోత్సహించడం ద్వారా పార్టీలో కొత్త ఊపిరి పోస్తున్నారు. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం తర్వాత ఖాళీ అయిన ఈ స్థానానికి బీఆర్ఎస్.. ఆయన భార్య మాగంటి సునీతను అభ్యర్థిగా నిలబెట్టింది. బీజేపీ ఇంకా అభ్యర్థిని డిసైడ్ చెయ్యలేదు. కానీ బలమైన అభ్యర్థిని నిలబెట్టే ఆలోచనలో ఉంది. అయినప్పటికీ కాంగ్రెస్ 25,000 మెజారిటీతో గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. నవీన్ యాదవ్ యూత్ కోఆర్డినేటర్‌గా స్థానిక సమస్యలపై పనిచేసి పాపులర్ అయ్యాడు. అతని డోర్ టు డోర్ క్యాంపెయిన్, కమ్యూనిటీ సర్వీసెస్ ద్వారా ఓటర్లతో బాండ్ ఏర్పరచుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య ఉత్సాహం ఎక్కువగా ఉంది. "నవీన్ అన్నను ఎవరైనా గెలిపిస్తారు" అంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఈ ఉప ఎన్నిక తెలంగాణలో కాంగ్రెస్ బలాన్ని పరీక్షించే అవకాశంగా మారింది. రేవంత్ రెడ్డి నిర్ణయం సరైనదేనా, లేక సీనియర్ల అసంతృప్తిని పెంచుతుందా అనేది రానున్న రోజుల్లో తేలనుంది.

## కల్తీ దగ్గు మందు కేసులో కీలక పరిణామం




చెన్నై: కల్తీ దగ్గు మందు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. 20 మంది చిన్నారుల మరణాలకు కారణంగా భావిస్తున్న కోల్డ్రిఫ్ సిరప్ తయారు చేసిన శ్రేసన్ ఫార్మాసూటికల్స్ కంపెనీ యాజమాని జి.రంగనాథన్(73)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జి. రంగనాథన్ మద్రాస్ మెడికల్ కాలేజీ నుంచి ఫార్మసీ గ్రాడ్యుయేట్. గత 40 ఏళ్లుగా ఔషధ తయారీ రంగంలో ఉన్నారు. 80వ దశకంలో ప్రోనిట్ అనే పోషక సిరప్‌ను తయారు చేసి చెన్నైలో ప్రసిద్ధి పొందారు. ఆ తర్వాత లిక్విడ్ నాసల్ ప్రొడక్ట్స్(ముక్కు డ్రా ప్స్), చిన్న స్థాయి తయారీ యూనిట్లను చెన్నై పరిసరాల్లో స్థాపించారు. శ్రేసన్‌తో పాటు సీగో ల్యాబ్స్, ఇవెన్ హెల్త్‌కేర్ సంస్థలతో ఆయనకు సంబంధాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా పలు ఔషధ సమావేశాల్లో పాల్గొన్న ఆయన.. ఎందరో యువ పారిశ్రామికవేత్తలకు మార్గనిర్దేశకుడిగా నిలిచారు కూడా. అయితే మధ్యప్రదేశ్ చిన్నారుల మరణాల నేపథ్యంలో.. శ్రేసన్ సంస్థపై కేసు నమోదు అయ్యింది. కోడంబాక్కంలోని రంగనాథన్ కార్యాలయాన్ని సైతం అధికారులు సీజ్ చేశారు. ఆయన అరెస్టును పోలీసులు ధృవీకరించాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. తమిళనాడు కాంచీపురం శ్రేసన్ ఫార్మాసూటికల్స్ యూనిట్ నుంచి మే నెలలో కోల్డ్రిఫ్ కాఫ్ సిరప్ (Cough Syrup) బ్యాచ్‌ను పలు రాష్ట్రాలకు పంపింది. ఈ క్రమంలో సెప్టెంబర్–అక్టోబర్ మధ్య కాలంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కలిపి 20 మంది చిన్నారులు మరణించారు. ఈ నేపథ్యంలో కోల్డ్రిఫ్‌ను నిషేధించిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. మరణాలపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం(SIT) ఏర్పాటు చేసింది. పలువురు అధికారులపై సస్పెన్షన్ వేటు కూడా వేసింది. అయితే.. కోల్డ్‌రిఫ్‌లో డైఈథిలీన్ గ్లైకాల్ (DEG) అనే పదార్థం మోతాదుకు మించి(500 రేట్లు) 48.6% స్థాయిలో ఉన్నట్లు ల్యాబ్ పరీక్షల్లో తేలింది. ఇదే పిల్లల్లో కిడ్నీలను కరాబు చేసి.. వాళ్ల మరణాలకు దారి తీసింది. తమిళనాడు ప్రభుత్వ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ తనిఖీల అనంతరం తీవ్ర ఉల్లంఘనలను గుర్తించి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న శ్రేసన్ యూనిట్‌ను మూసేసింది. 2011లో ఏర్పాటైన ఈ యూనిట్.. ఆ తర్వాతి కాలంలో నిబంధనలకు అనుగుణంగా నడుచుకోలేదు. అలాగే అక్కడి అపరిశుభ్ర వాతావరణం, నిబంధనలకు పాటించకుండా కెమికల్స్ కొనుగోలు నేపథ్యంతో ఉత్పత్తి లైసెన్స్‌నూ రద్దు చేసింది. ఈ క్రమంలో క్రిమినల్ కేసు నమోదైనట్లు సమాచారం.

## సీనియర్ల వేధింపుల కారణంతోనే ఐపీఎస్ ఆఫీసర్ ఆత్మహత్య



హర్యానా:హర్యానా సీనియర్ ఐపీఎస్ అధికారి వై పురాన్ కుమార్ సూసైడ్‌చేసుకున్నారు. తన నివాసంలో గన్‌తో కాల్చుకుని మంగళవారం (అక్టోబర్ 7) ఆత్మహత్యకు పాల్పడ్డారు. మరణానికి ముందు రాసిన 9 పేజీల సూసైడ్ నోట్ ఆయన జేబులో లభ్యమైంది. ఇందులో 12 మంది అధికారులు తనను మానసికంగా వేధింపులకు గురి చేసినట్లు ఆరోపించారు. తన ఆస్తి మొత్తం భార్యకు బదిలీ చేస్తున్నట్లు సూసైడ్‌లో ఓ పేజ్‌లో రాశారు. ఈ కేసు హర్యానా రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించింది. ఈ వ్యవహారంలో ఆయన భార్య ఐఏఎస్ అమ్నీత్ పి కుమార్.. హర్యానా డీజీపీ రోహ్తక్ ఎస్పీపై చండీగఢ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తన భర్తపై తప్పుడు అవినీతి కేసు నమోదు

హర్యానా డీజీపీ శత్రుజీత్ సింగ్ కపూర్, రోహ్తక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియా తన భర్తపై మానసిక వేధింపులు, కుల ఆధారిత వివక్ష, హింసకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. రోహ్తక్‌లో తన భర్తపై తప్పుడు అవినీతి కేసు నమోదు చేసి వేదింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. ఇది డీజీపీ శత్రుజీత్ కపూర్ ఆదేశాల మేరకు ఉద్దేశపూర్వక కుట్ర అని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని వల్ల తన భర్త తీవ్ర మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. తన భర్త ఎస్సీ/ఎస్టీ వర్గానికి చెందినవాడు కాబట్టి కుల ఆధారిత వివక్షకు గురయ్యాడని, బహిరంగంగా అవమానించారని ఐఏఎస్ అమ్నీత్ పి కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక పురాన్ కుమార్ సూసైడ్ నోట్‌లో 7 నుంచి 8 మంది ఐపీఎస్‌లు, ఇద్దరు ఐఏఎస్ అధికారుల పేర్లను పేర్కొన్నారు. కుల ఆధారిత వివక్ష, ప్రభుత్వ వసతి నిరాకరణ, పనితీరు నివేదికలలో అవకతవకలు, నిరంతర ఒత్తిడి కారణంగా మానసికంగా బాధపడుతున్నానని పురాన్ కుమార్ అందులో పేర్కొన్నారు.

## సంపాదకీయం

**శుక్రవారం 10-10-2025**

# వెలుగుల వెనుక చేదు నిజాలు

భారత వైమానిక దళం నేడు సగర్వంగా 93వ వార్షికోత్సవం జరుపుకొంటోంది. ఉగ్రవాద నెగళ్లను రాజేస్తున్న పాకిస్థాన్‌కు మన గగనయోధులు గట్టిగా బుద్ధిచెప్పిన తీరు జాతి స్మృతిపథంలో ఎప్పటికీ నిలిచిపోతుంది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ముష్కర ముఠాల అడ్డాలు, పాక్ వైమానిక స్థావరాలపై గురితప్పకుండా దాడిచేసిన తీరు అమోఘం. ఈ వెలుగుల మాటున ఒక చేదు నిజం భారత రక్షణ వ్యూహకర్తలను కలవరపెడుతోంది. అది- పడిపోతున్న ఫైటర్ జెట్ స్క్వాడ్రన్ల సంఖ్య!ఆరు దశాబ్దాలపాటు భారత వైమానిక దళానికి వెన్నెముకగా ఉన్న మిగ్-21 యుద్ధ విమానాలను ఇటీవల సర్వీసు నుంచి తొలగించారు. ఇప్పటికే ఈ శ్రేణికి చెందిన అనేక జెట్‌లను ఉపసంహరించగా, చివరిగా మిగిలిపోయిన రెండు స్క్వాడ్రన్లను గతనెల 26న తొలగించారు. దాంతో ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య ఆందోళనకర స్థాయిలో 29కి పడిపోయింది. ఒక్కో స్క్వాడ్రన్‌లో 16-20 జెట్‌లు ఉంటాయి. నిజానికి భారత వాయుసేనకు ప్రభుత్వం అనుమతించిన స్క్వాడ్రన్ల సంఖ్య 42. పాకిస్థాన్, చైనా కుమ్మక్కై ఏకకాలంలో యుద్ధానికి దిగితే దాన్ని తిప్పికొట్టడానికి ఇన్ని అవసరమన్నది నాటి వ్యూహకర్తల ఆలోచన. మన ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య 1996లో గరిష్ఠంగా 41కి చేరింది. ఆ తరవాత మరెన్నడూ ఆ స్థాయిని అందుకోలేదు. అయితే, కేంద్రం ఈ సంఖ్యను 30శాతం మేర పెంచే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాకిస్థాన్ దగ్గర 25, చైనా అమ్ములపొదిలో దాదాపు 65 ఫైటర్ స్క్వాడ్రన్లు ఉన్న విషయాన్ని ఇక్కడ గమనించాలి.

'తేజస్' సరఫరాలో జాప్యం...

మిగ్-21ల స్థానాన్ని భర్తీ చేయాల్సిన స్వదేశీ తేజస్ యుద్ధవిమానాల సరఫరా మందగమనంలో సాగడమే ప్రస్తుత ఇక్కట్లకు ప్రధాన కారణం. 1983లో ప్రారంభించిన ఈ జెట్ రూపకల్పన ప్రాజెక్టులో జాప్యం వాయుసేనకు ఇబ్బందిగా పరిణమించింది. నిజానికి మిగ్-21లను దశాబ్దం కిందటే ఉపసంహరించాల్సి ఉంది. వీటి స్థానంలో తొలుత తేజస్ మార్క్-1లను, ఆ తరవాత మరింత ఆధునికమైన మార్క్-1ఏ, మార్క్-2 వేరియంట్లను ప్రవేశపెట్టాల్సింది. మార్క్-1కు సంబంధించి 2006, 2010లో 40 జెట్‌ల కోసం ఆర్డర్లు ఇవ్వగా, ఇప్పటి వరకూ 38 అందాయి. రూ.48వేల కోట్లతో 83 తేజస్ మార్క్-1ఏ ఫైటర్ల కొనుగోలుకు 2021 ఫిబ్రవరిలో వాయుసేన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్)కు ఆర్డర్ ఇచ్చింది. దీనికింద తొలి జెట్ 2024 మార్చిలో అందాల్సింది. అమెరికా నుంచి ఇంజిన్ల సరఫరాలో జాప్యం కారణంగా ఇప్పటి వరకూ ఒక్క మార్క్-1ఏ జెట్ కూడా వాయుసేనకు అందలేదు. ఇవి కాక 97 తేజస్ మార్క్-1ఏల కోసం రూ.62,370 కోట్లతో రక్షణశాఖ ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. వచ్చే ఏడాది నుంచి ఏటా 16 తేజస్‌లను ఉత్పత్తి చేస్తామని హెచ్‌ఏఎల్ చెబుతోంది. 2027లో తేజస్ మార్క్-2 తొలి గగనవిహారం చేసే అవకాశముంది. మరోవైపు 114 బహుళ ప్రయోజన యుద్ధవిమానాల కొనుగోలుకూ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.పూర్తిస్థాయి పోరాట సన్నద్ధతను కలిగి ఉండాలంటే భారత్ వచ్చే రెండు దశాబ్దాల్లో ఏటా కనీసం 35-40 చొప్పున యుద్ధవిమానాలను సమకూర్చుకోవాల్సి ఉంటుందని వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ పేర్కొన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అది అసాధ్య లక్ష్యమని భారత ఆయుధ సమీకరణ విధానాల గురించి తెలిసిన ఎవరైనా ఇట్టే చెప్పేయగలరు. మరో పదేళ్లలో మిరాజ్-2000, మిగ్‌కు సంబంధించిన ఇతర వేరియంట్లు, జాగ్వార్ యుద్ధవిమానాలను ఉపసంహరించాల్సి వస్తుంది. యుద్ధవిమానాల సేకరణ వేగం అందుకోకపోతే భారత్, పాక్‌ల దగ్గర ఫైటర్ జెట్‌లు సమానస్థాయికి చేరుకోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చైనా నుంచి పాక్‌కు...

స్వదేశీ యుద్ధవిమాన ప్రాజెక్టులు ఇప్పుడు కీలక దశలో ఉన్నాయి. వాయుసేన ప్రధానంగా తేజస్ మార్క్-2, అయిదోతరం యుద్ధవిమానం-అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఆమ్కా)పై ఆశలు పెట్టుకుంది. భవిష్యత్తులో విమాన వాహకనౌకల నిమిత్తం ట్విన్‌ఇంజిన్ డెక్‌బేస్డ్ ఫైటర్(టీఈడీబీఎఫ్) కోసం నౌకాదళం ఎదురుచూస్తోంది. ఈ మూడు ప్రాజెక్టులు భారత వాయుశక్తి స్వయంప్రతిపత్తికి ఆశాకిరణాలు. అయితే, వీటి విషయంలో వేగం పెంచాల్సి ఉంది.చైనా ఇప్పటికే అయిదో తరం స్టెల్త్ యుద్ధవిమానాలు జె-20, జె-35లను సమకూర్చుకుంది. పాకిస్థాన్‌కు జె-35కు సంబంధించిన ఎఫ్‌సీ-31 వేరియంట్‌ను త్వరలోనే అందజేయబోతోంది. దాంతో ఈ తరగతి జెట్‌లను ఉపఖండంలో తొలిసారిగా సమకూర్చుకున్న దేశంగా పాకిస్థాన్ నిలవబోతోంది. అది భారత్‌కు ఇబ్బందికరం. మన దేశం తలపెట్టిన అయిదోతరం యుద్ధవిమానం 'ఆమ్కా' దశాబ్దం తరవాతే వాయుసేనకు అందుతుంది. మరోవైపు చైనా ఆరోతరం యుద్ధవిమాన రూపకల్పనకూ కసరత్తు ఆరంభించింది. కాబట్టి, తాత్కాలికంగా లోటును భర్తీ చేసుకోవడానికి రష్యాకు చెందిన అయిదోతరం యుద్ధవిమానం ఎస్‌యూ-57 జెట్‌లను పరిమిత సంఖ్యలో కొనుగోలు చేయాలని భారత్ తలపోస్తున్నట్లు సమాచారం.

గుణపాఠాలు నేర్వాలి...

మిగ్-21లపై సుదీర్ఘకాలం ఆధారపడటం భారత సైనిక ఆధునికీకరణ, రక్షణ పరిశోధన, కొనుగోళ్లు, తయారీలో వ్యవస్థీకృత జాప్యాలకు అద్దం పడుతోంది. దేశీయ ప్రాజెక్టులు ఫలప్రదం కాకపోవడానికి నైపుణ్యాల లేమి ప్రధాన కారణం కాదనీ... రాజకీయ మద్దతు పరిమితంగా ఉండటం, అధికారుల స్థాయిలో అవరోధాలు, దిగుమతి చేసుకున్న సాంకేతికతలపై మితిమీరి ఆధారప డటమేనన్న వాదన ఉంది. మిగ్-21 వ్యవహారం నుంచి భారత్ గుణపాఠాలు నేర్చుకోవాలి. కాలంచెల్లిన యుద్ధవిమానాలను సుదీర్ఘకాలం కొనసాగించాల్సిన పరిస్థితి మరోసారి ఉత్పన్నం కాకుండా ముందుచూపుతో వ్యవహరించాలి. తాత్కాలిక సర్దుబాటు కోసం చేపట్టే దిగుమతులకు దీర్ఘకాల స్వయంసమృద్ధి లక్ష్యాలకు మధ్య సమతౌల్యం సాధించాలి. భావితరం ఫైటర్ జెట్‌ల తయారీకి డీఆర్‌డీవో, హెచ్‌ఏఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలూ ప్రైవేటు కంపెనీలూ స్టార్టప్‌లూ కలిసికట్టుగా కృషి చేయాలి. భవిష్యత్తులో ఇండియా సమకూర్చుకునే నిఘా, యుద్ధ విమానాలు, డ్రోన్లు, ఉపగ్రహాలు, నేలపై మోహరించే సెన్సర్లతో కూడిన నెట్‌వర్క్‌లోకి సులువుగా ఇమిడిపోయేలా ఉండాలి.

# "హైదరాబాద్‌కు చైనా ఉరి" ఎఫెక్ట్.. చూస్తూ ఊరుకుంటామా?




హైదరాబాద్,ఫరెవర్ కెమికల్స్ ఉత్పత్తితో తుంగభద్ర, కృష్ణా జలాలకు.. తద్వారా హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఎదురయ్యే ఇబ్బందులు, తదనంతర పరిణామాలపై తెలుగుప్రభ "హైదరాబాద్‌కు చైనా ఉరి" శీర్షికతో ప్రచురించిన వివరణాత్మక, విశ్లేషణాత్మక కథనంపై ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున స్పందించాయి. రాయలసీమ విద్యావంతుల వేదిక మొదలు పర్యావరణ సంస్థల దాకా అనేక సంఘాల ప్రతినిధులు తెలుగుప్రభకు అభినందనలు తెలియజేశారు.ఫరెవర్ కెమికల్స్‌కు సంబంధించిన అంశాలను సరళమైన భాషలో సామాన్యులకు అర్థమయ్యేలా ప్రచురించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా టీజీవీ కంపెనీ చేపట్టనున్న ఉత్పత్తి ప్రోటోకాల్‌ను, ఎస్ఓపీని బయపెట్టి వాళ్ల నిజాయితీని చాటుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి మెసేజ్‌లు, మెయిల్స్ రూపంలో అభినందనలు వెల్లువెత్తాయి. సదరు పరిశ్రమకు పక్కనే ఉన్న తుంగభద్ర నదితో పాటు కృష్ణానది తీవ్రంగా కలుషితమయ్యే ప్రమాదముందన్న విషయంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలనే డిమాండ్ వచ్చింది.ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ అధ్యక్షులు రామచంద్రరావు తెలుగుప్రభతో మాట్లాడారు. పర్యావరణం కలుషితం కావటాన్ని ఎవరూ హర్షించరని, పర్యావరణ పరిరక్షణ బాధ్యత కాలుష్య నియంత్రణా మండలిదేనని ఆయన కుండబద్దలుకొట్టి చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తొమ్మిది జిల్లాలు ఆ నీటిపై నేరుగా ఆధారపడి ఉన్నాయని, ఎగువనున్న ఆంధ్రప్రదేశ్లో ఇటువంటి ప్రమాదకరమైన రసాయనాలను ఉత్పత్తి చేసి, మన రాష్ట్ర జలవనరులను కలుషితం చేస్తామంటే చూసస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఆ కంపెనీ ప్రతినిధులను, కుటుంబసభ్యులను కూడా తెలంగాణలో అడుగుపెట్టనీయబోమని హెచ్చరించారు. అలాగే సదరు పరిశ్రమకు సంబంధించిన ఉత్పత్తి నిర్వహణా కార్యకలాపాల విస్తరణను అడ్డుకోవటానికి అవసరమైతే ఎన్జీటీని ఆశ్రయిస్తామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మాజీ మంత్రి జగదీష్రెడ్డి.. తుంగభద్రతో పాటు కృష్ణాజలాలను విషపూరితం చేస్తే చూస్తూ ఊరుకోమని మండిపడ్డారు. ఇప్పటికే నీళ్లను ఎత్తుకుపోతున్నారని, ఇంకా కలుషితం కూడా చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈఐఏ నోటిఫికేషన్లో స్పష్టత కరువు:

పర్యావరణ మంత్రిత్వశాఖ 2006లో జారీచేసిన నోటిఫికేషన్ల ఆధారంగా కాలుష్య నియంత్రణా మండలి ఆయా కాలుష్యకారక సంస్థలు లేదా పరిశ్రమలపై కన్వీనర్ హోదాలో జిల్లా అధికారులతో కలిసి, ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుంది. ఇది ఎక్కడైనా సాధారణమే. కొన్ని సందర్భాల్లో ఆ రాష్ట్రంలోని రెండు జిల్లా పరిధుల్లో వచ్చే ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరపాల్సినప్పుడు రెండు జిల్లాలను పరిగణనలోకి తీసుకొని ఈ తంతు ముగిస్తారు. టీజీవీ ఎస్ఆర్ఏసీఎల్ కంపెనీ విషయంలో ఒక గమ్మత్తైన అంశం ఏమిటంటే ఈ పరిశ్రమ ఆంధ్ర %-% తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఉంది. కాకపోతే పరిశ్రమ భూభాగం గం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. దీంతో స్థానిక కాలుష్య నియంత్రణా మండలి అధికారులు ఈఐఏ -2006 నోటిఫికేషన్ను అనుసరించి ప్రజాభిప్రాయ సేకరణ జరిపించారు. అయితే ఈ నోటిఫికేషన్లోనే అంతర్లీనంగా మరో అంశం కూడా ఉంది. ఏ సంస్థ అయితే ప్రజాభిప్రాయ సేకరణకు వస్తున్నదో ఆ సంస్థకు చుట్టూ 10 కిలోమీటర్ల రేడియస్లో పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలను ప్రజాభిప్రాయ సేకరణ వేదికలో సమర్పించి, వివరించాల్సి ఉంటుంది.ఇక్కడ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది, అలాగే నోటిఫికేషన్ ప్రకారం పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక కూడా సమర్పించారు. ఇక్కడే అసలు సమస్య తెరపైకి వచ్చింది. ఈ పరిశ్రమకు 10 కిలోమీటర్ల పరిధిలో తెలంగాణ ప్రాంతం వస్తుంది. దీన్ని స్థానిక పీసీబీ అధికారులు పరిగణలోకి తీసుకోలేదు. ఎందుకంటే ఈఐఏ నోటిఫికేషన్లో రెండు రాష్ట్రాల సరిహద్దులు ఈ విధంగా వచ్చినప్పుడు ఏమిచేయాలో ఆ నోటిఫికేషన్లో పొందుపరచలేదు. ఇది కూడా కేంద్రానికి ఓ సవాలుగా మారింది. విచక్షణాధికారం ఉపయోగించి అధికారులు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలిని కూడా పరిగణలోకి తీసుకోవాల్సింది. ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసు ఇచ్చి, ఆయా గ్రామస్థులు కూడా అభిప్రాయ సేకరణలో పాల్గొనేలా చేయాల్సి ఉంది. కానీ అలా జరగలేదు. నిజానికి కంపెనీ ఉన్నది కర్నూలులోనే అయినా ఉత్పత్తి పర్యవసానాలు ఎదుర్కోవాల్సింది మాత్రం తెలంగాణ ప్రజలే. అందులోనూ తెలంగాణ జీవనాధారం కృష్ణానదిపై దీని ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందన్నది పర్యావరణ శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇదే ఇప్పుడు తెలంగాణ వాసుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఈ వివాదంలో జోక్యం చేసుకుని అసలు ఈ కంపెనీ ఏ ఉత్పత్తులు చేపట్టనుంది? ఏ ప్రక్రియలో చేపట్టనుంది? దాని ద్వారా వచ్చే కాలుష్య పరిమాణం ఎంత? కాలుష్య నివారణకు ఏ విధమైన చర్యలు చేపడతారు? దిగువన ఉన్న నదులు ఎంత వరకు సురక్షితం? తదితర వివరాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉంది. అప్పుడే పరిశ్రమకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి పరిశ్రమలను నీటి వనరుల సమీపంలో, జనావాసాల మధ్య కాకుండా ప్రత్యేక సెజ్‌లో ఏర్పాటు చేసుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. లేదంటే తుంగభద్ర నది మొదలు కృష్ణా ప్రవాహమంతటా విషమే మిగులుతుందని హెచ్చరిస్తున్నారు.

ప్రజల నుంచి స్పందన లేదని ఆవేదన:

తెలుగుప్రభ కృషిని, నిబద్ధతను ప్రశంసిస్తూ అనేక మంది కార్యాలయం ఫోన్ నంబర్కు మెసేజ్లు పంపించారు. పీసీబి అధికారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ పార్టీల నాయకులు ప్రజల హక్కులను హననం చేస్తున్న తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విపత్తు ఎదురవబోతున్నా, విధ్వంసం జరగబోతున్నా ప్రజల్లో స్పందన రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫరెవర్ కెమికల్ ఉత్పత్తి వల్ల ప్రతి ప్రాణికి క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్నదని, మృత్యువు ఎదురుగా వస్తుందన్న విషయాన్ని గమనించాలని కోరారు. పలువురు శాస్త్రవేత్తలు స్వచ్ఛందంగా చేస్తున్న పోరాటం పట్ల ధన్యవాదాలు తెలిపారు. తుంగభద్ర నదికి వందల మీటర్ల దూరంలోనే ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమ వల్ల భావితరాలు ఎలా ఉంటాయన్నది తలుచుకుంటేనే భయంగా ఉన్నదని ఆ నదికి సమీపంలో జీవనం సాగిస్తున్న కొందరు అభిప్రాయపడ్డారు.

టీజీ వెంకటేష్ ఫ్యామిలీని హైదరాబాద్ లో తిరగనియ్యం : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

టీజీ వెంకటేశ్ కు సంబంధించిన టీజీవీ ఎస్ఆర్ఏసీఎల్ ఉత్పత్తి చేయనున్న రసాయనం అత్యంత ప్రమాదకరమైనది. దీంతో తెలంగాణలో ప్రవహిస్తున్న కృష్ణా, తుంగభద్ర నదులు కలుషితం అవుతాయి. భవిష్యత్ లో హైదరాబాద్ లో తాగునీరు పూర్తిగా కలుషితం అయి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. వెంటనే ఈ ప్రాజెక్ట్ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలి. రాష్ట్రానికి హాని చేస్తూ స్వలాభం కోసం ప్రాజెక్టుపై ముందుకు వెళ్తే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేస్తాం. టీజీ వెంకటేష్ ఫ్యామిలీని హైదరాబాద్ లో తిరగనియ్యకుండా అడ్డుకుంటాం.

పీసీబీదే బాధ్యత: తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

టీజీవీ ఎస్ఆర్ఏసీఎల్ పరిశ్రమ విస్తరణతో తెలంగాణలో ప్రవహిస్తున్న కృష్ణా, తుంగభద్ర నదులు కలుషితం అవుతాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను శాస్త్రీయంగా పరిశీలించి, ప్రాజెక్టు తదుపరి అనుమతులు ఇవ్వాలి. రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ బాధ్యత పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తీసుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు అనుమతులు మంజూరు చేశారు. ప్రస్తుతం అది ఏపీలోని కర్నూల్ లో నిర్మిస్తున్నారు, శాస్త్రీయంగా అన్ని విషయాలు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పీసీబీ పైనే ఉంది.ప్రజల్లో చైతన్యం వస్తేనే నదుల్లో కలుషితం ఆపగలం: ఎం శ్యాం ప్రసాద్ రెడ్డి, తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల ఫోరం అధ్యక్షుడు రాష్ట్రంలో గోదావరి జలాలు కలుషితమయ్యాయి. వివిధ రక్తాల పరిశ్రమల ఏర్పాటు వల్ల గోదావరి ఘోరంగా కలుషితమైంది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ఇప్పటి వరకు ఎలాంటి పరిశ్రమలు లేవు. టీజీ వెంకటేశ్ కు ఆల్రెడీ ఒక ఇండ్రస్టీ ఉంది. మళ్లీ అదే ప్రాంతంలో రసాయనాలు వెదజల్లే పరిశ్రమ నిర్మిస్తే తెలంగాణకు తీవ్ర నష్టం. ప్రభుత్వాలను నమ్మితే ప్రయోజనం ఉండదు. ప్రజల్లో చైతన్యం రావాలి. మన రాష్ట్రంలో పొల్యూషన్ బోర్డు చాలా నిస్సారమైంది. ప్రజల గురించి ఆలోచన ఉండదు. కేవలం పరిశ్రమల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తుంది. మూసీ నదీ కలుషితాన్ని అడ్డుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నాం. హైదరాబాద్ సిటీకి, నల్లగొండ, మహబూబ్నగర్ జిల్లాలకు ప్రాణాధారమైన కృష్ణా నదిని కలుషితం చేస్తే ప్రజలే తిరబడ్డరు.

కృష్ణా పరివాహక ప్రాంతాన్ని కాలుష్యం చేస్తే సహించేది లేదు: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

కృష్ణా నదీ పరివాహక ప్రాంతానికి అవతలి వైపు జరుగుతున్న కుట్రలను అడ్డుకుంటున్నాం. ఇప్పటికే పోతిరెడ్డి పాడు ద్వారా కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోతున్నారు. సాగర్ ప్రాజెక్ట్ వద్ద కుడి కాల్వ నుంచి కేటాయింపులకు మించి నీటిని తీసుకెళ్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.. ఇప్పుడు ఏకంగా కృష్ణా జలాలను కలుషితం చేసే ప్రాజెక్టులు, రసాయనిక పరిశ్రమలు స్థాపిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. కేంద్రం అలాంటి పరిశ్రమలకి అనుమతులు ఇవ్వొద్దు. హైదరాబాద్ జంట నగరాలు, నల్గొండ జిల్లాలో 7 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది. కృష్ణా నీటిని కలుషితం చేసే పరిశ్రమలకు కేంద్రం అనుమతులు ఇవ్వాలని చూస్తే పెద్ద ఎత్తున్న ఆందోళన మొదలు అవుతాయి. తెలుగుప్రభలో వచ్చిన కథనంపైన రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఆలోచించి, స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉంది.

# భారత్ - రష్యా.. రక్షణ సహకారంలో మరో కీలక పరిణామం



న్యూఢిల్లీ, భారత్-రష్యా రక్షణ సహకారంలో అత్యంత ముఖ్యమైన మరియు కీలకమైన పరిణామంగా, రష్యా తన అత్యాధునిక ఎస్-500 ప్రామెతేయ్ గగనతల రక్షణ వ్యవస్థను భారత్‌తో కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి మరియు ఉత్పత్తి చేయడానికి ఒక ప్రతిపాదనను సమర్పించింది. ఇది కేవలం ఆయుధాల విక్రయం కాకుండా, సాంకేతికత బదిలీ మరియు భారతీయ మార్గాల ద్వారా మూడవ దేశాలకు పునః-ఎగుమతి చేసే హక్కును కూడా భారత్‌కు కల్పించే ప్రతిపాదన కావడం విశేషం.

ప్రతిపాదనలోని కీలక అంశాలు:

ఎస్-500 సహ-ఉత్పత్తి (S-500 Co-Production): రష్యా నుంచి పూర్తి స్థాయిలో తయారైన వ్యవస్థలను దిగుమతి చేసుకునే పాత విధానానికి భిన్నంగా, ఈ కొత్త ప్రతిపాదన భారతదేశంలోనే ఎస్-500 వ్యవస్థలను సంయుక్తంగా ఉత్పత్తి చేసే అవకాశాన్ని కల్పిస్తుంది. ఇది భారతదేశ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి బలాన్ని చేకూర్చడమే కాకుండా, దేశీయంగా అత్యాధునిక రక్షణ సాంకేతికతను అభివృద్ధి చేయడంలో భారత్‌ను కీలక శక్తిగా మారుస్తుంది.పునః-ఎగుమతి హక్కులు (Re-Export Rights): ఈ ఒప్పందంలో అత్యంత విప్లవాత్మకమైన అంశం ఏమిటంటే, భారత్-రష్యా సంయుక్తంగా ఉత్పత్తి చేసిన ఎస్-500 వ్యవస్థలను మూడవ దేశాలకు ఎగుమతి చేసే హక్కును భారత్‌కు ఇవ్వడం. పాశ్చాత్య దేశాల ఆంక్షల కారణంగా రష్యా ప్రత్యక్షంగా రక్షణ పరికరాలను విక్రయించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఈ ఒప్పందం ద్వారా రష్యన్-మూలానికి చెందిన అత్యాధునిక ఆయుధాలు భారతీయ సరఫరా గొలుసుల ద్వారా ప్రపంచ మార్కెట్‌ను చేరుకునేందుకు అవకాశం లభిస్తుంది.ఎస్-500 సామర్థ్యం (S-500 Capability): ఎస్-500 వ్యవస్థ, దాని పూర్వగామి అయిన ఎస్-400 కంటే అత్యంత శక్తివంతమైనది. ఇది 600 కిలోమీటర్ల దూరం వరకు మరియు 200 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉన్న లక్ష్యాలను ఛేదించగల విస్తృత సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ వ్యవస్థను ఎస్-400 మరియు దేశీయ ప్రాజెక్ట్ కుశ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలతో కలిపి ఉపయోగించడం ద్వారా, భారత్ తన గగనతల రక్షణ కవచాన్ని మరింత పటిష్టం చేసుకోవచ్చు.ఎస్-400 డెలివరీలు (S-400 Deliveries): దీనికి అదనంగా, 2018లో భారత్ కుదుర్చుకున్న 5 ఎస్-400 క్షిపణి వ్యవస్థల డెలివరీలను 2026 నాటికి పూర్తి చేయనున్నట్లు రష్యా ధృవీకరించింది. ఇప్పటికే నాలుగు వ్యవస్థలు అప్పగించగా, చివరి వ్యవస్థ డెలివరీ వచ్చే ఏడాదికి పూర్తి కానుంది. ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్లో ఎస్-400 వ్యవస్థల సామర్థ్యం విజయవంతం కావడంతో, భారత్ అదనంగా మరో 5 ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేయడానికి కూడా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.ఈ ప్రతిపాదన ఆమోదం పొందితే, భారత్-రష్యా రక్షణ సంబంధాలు కేవలం కొనుగోలుదారు-విక్రేత స్థాయి నుండి ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి మరియు అత్యాధునిక సైనిక ప్లాట్‌ఫారమ్‌ల ఉత్పత్తి దిశగా మరింతగా రూపాంతరం చెందుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రక్షణ రంగంలో వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని సాధించాలన్న భారతదేశ లక్ష్యానికి ఇది పెద్ద ఊతమిస్తుంది.

# భారత్ నిర్ణయాలను శాసించలేం

న్యూయార్క్,అమెరికా అధ్యక్షుడికి మెల్లగా సొంత వర్గం నుంచే వ్యతిరేకత వస్తోంది. ఆయన చర్యలు కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో యాదార్థాలన ముక్కుసూటిగా చెప్పేస్తున్నారు. ప్రధానంగా రష్యా నుంచి భారత్ ఆయిల్ కొనుగోలుపై ట్రంప్ తీరును తప్పుపడుతున్నారు. భారత్ సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి.. ఎవరితో కొనసాగించ కూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు అని గ్రీర్ తెలిపారు. రష్యా నుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కో నుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ది ఎకనామిక్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కో నుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్ల నుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు.. ఆ చమురును శుద్ధి చేసి రీసేల్ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోళ్లు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది. అందుకే వారు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నాం. దీన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు ఈ విషయంలో వైవిధ్యభరిత చర్యలు ప్రారంభించడం మేం చూస్తున్నాం అని గ్రీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు 40 బిలియన్ డాలర్లకు పైగా మిగులు ఉంటోంది. మేం వారికి విక్రయించే దానికంటే.. భారత్ మాకు అమ్మేవే ఎక్కువ. అయితే, రష్యా చమురును కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి పుతిన్‌కు న్యూఢిల్లీ వనరులను అందించినట్లవుతోంది. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఈ స్థాయిలో సుంకాలు విధించాల్సి వచ్చింది. అయితే, టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ఆ దేశం గొప్ప డీల్ చేసుకుంటోందని గ్రీర్ వెల్లడించారు. దీనిని బట్టి మెల్లగా వాస్తవాలను ట్రంప్ బృందం గుర్తిస్తోందని తెలుస్తోంది.

# భారత్‌తో యుద్ధ ప్రమాదం తొలగిపోలేదు

లాహోర్,ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్బాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు.పాక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయలేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు.ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. 'భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అంతేగాక, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సైనికులను ఆదేశించారు. పూర్తి సన్నద్ధంగా ఉండండి. దేవుడు వాంఛిస్తే ఆ అవకాశం త్వరలోనే మనకు వస్తుంది అని భారత జవాన్లకు ఆయన పిలుపునిచ్చారు.

# అసలేంటీ డైఈథిలీన్ గ్లైకాల్?

న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో చిన్నారుల మరణాలకు కారణమైన 'కోల్డ్?రిఫ్?' కాఫ్? సిరప్ ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన రేపుతోంది. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం జిల్లాలో ఉన్న శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ యూనిట్‌లో తయారైన ఈ సిరప్ నమూనాల్లో డైఈథిలీన్ గ్లైకాల్ అనే ప్రమాదకర రసాయనం పరిమితిని మించి ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ధృవీకరించింది.మధ్యప్రదేశ్ చింద్వారా జిల్లాలో సేకరించిన నమూనాలు క్లీన్‌గా ఉన్నప్పటికీ, తయారీ కేంద్రం నుంచే సేకరించిన నమూనాల్లో DEG కలుషితమైనట్లు తేలింది. దీంతో మధ్యప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు వెంటనే ఆ సిరప్ విక్రయాలను నిషేధించాయి.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, CDSCO, NIV, ICMR, NEERI, AIIMS నాగ్‌పూర్ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందం ఇప్పుడు ఈ దగ్గుమందు గురించి పరిశోధిస్తోంది.అదే సమయంలో, దేశవ్యాప్తంగా ఉన్న 19 ఔషధ తయారీ యూనిట్లపై తనిఖీలు ప్రారంభమయ్యాయి.

డైఈథిలీన్ గ్లైకాల్ -కనపడని మృత్యువు

డైఈథిలీన్ గ్లైకాల్ మరియు ఎథిలీన్ గ్లైకాల్ అనే రసాయనాలు సాధారణంగా పారిశ్రామిక ద్రావకాలు ను యాంటీ ఫ్రీజ్, పెయింట్స్, బ్రేక్ ఫ్లూయిడ్స్, ప్లాస్టిక్‌ల తయారీలో వాడతారు. ఇవి ఔషధ తయారీలో వాడకూడదు. అయితే కొన్నిసార్లు గ్లిసరిన్ వంటి ఫార్మా పదార్థాలను చవకైన పరిశ్రమ స్థాయి పదార్థాలతో భర్తీ చేయడం వల్ల ఈ విష రసాయనాలు మందుల్లో కలుస్తాయి. DEGకి రంగు ఉండదు, తియ్యగా ఉంటుంది, టానిక్?లా కనబడుతుంది కాబట్టి గ్లిసరిన్? స్థానంలో వాడతారు. కొన్నికఠినమైన ల్యాబ్ పరీక్షలు చేయకపోతే అది నిజమైన గ్లిసరిన్ కాదని తెలుసుకోవడం చాలా కష్టం.DEG<' EG మన శరీరంలోకి ప్రవేశించినప్పుడు అవి విరిగిపోయి విష పదార్థాలుగా మారి మూత్రపిండాలు, కాలేయం, నాడీ వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. మొదట జ్వరం, వాంతులు, పొత్తికడుపు నొప్పి, మూత్రం తగ్గడం వంటి లక్షణాలు కనబడతాయి. అతి తక్కువ సమయంలో మూత్రపిండాల వైఫల్యం, ఫిట్స్, మరణం సంభవిస్తాయి. పిల్లల విషయంలో పరిస్థితి మరింత భయానకం. కొద్ది పరిమాణం DEG కూడా వారికి ప్రాణాంతకంగా మారుతుంది. గాంబియాలో 2022లో DEG కలుషిత సిరప్ వల్ల కనీసం 70 మంది చిన్నారులు మృతి చెందారు. అదే రసాయనం ఇప్పుడు భారత్‌లో కూడా వెలుగులోకి రావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు, కేంద్ర చర్యలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ఇప్పటికే పలు దేశాల్లో ఐజు+, జు+ కలుషిత సిరప్?ల కారణంగా 300 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. ఔనూ దగ్గుమందుల నాణ్యతా నియంత్రణ కోసం రెండు దశల ల్యాబ్ టెస్టింగ్ సిస్టమ్ ప్రవేశపెట్టింది:తక్కువ నాణ్యత గల ముడిపదార్థాలను

## జగన్ పర్యటనకు ఇన్ని ఆంక్షలా

విశాఖపట్నం,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు సంబంధించిన పోలీసులు ఇచ్చిన కొత్త రూట్‌ను తాము అంగీకరిస్తున్నామని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పర్యటనకు అనుమతి ఇస్తూనే 18 కండిషన్లు పెట్టారన్నారు. పోలీసులు ఇన్ని నిబంధనలు పెట్టడం సమంజసం కాదని... పునఃసమీక్షించుకోవాలని కోరుతున్నామని మాజీ మంత్రి తెలిపారు. గురువారం జగన్ పర్యటన ఎయిర్ పోర్టు నుంచి ఎన్ఏడి కొత్త రోడ్డు, గోపాల పట్నం, వేపగుంట, అనకాపల్లి మీదగా ప్రయాణిస్తారని... నర్సీపట్నం మెడికల్ కళాశాలకు వెళ్తారని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు తమ బాధను చెప్పుకోవడానికి ఎయిర్ పోర్టుకు కానీ మార్గం మధ్యలో ఎక్కడికైనా రావాల్సిందిగా కోరుతున్నామన్నారు. పోలీసుల రూట్ మార్చినంత మాత్రాన వైసీపీ తన మాటను మార్చదని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణకు వైసీపీ ఎప్పుడూ వ్యతిరేకమే అని.. తమ స్టాండ్ మారలేదని గుడివాడ అమర్‌నాథ్ తేల్చిచెప్పారు. ప్రజా ఉద్యమంలో భాగంగానే నర్సీపట్నం మెడికల్ కళాశాలకు జగన్ వస్తున్నారని మాజీ మంత్రి విడదల రజనీ తెలిపారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఉండాలన్నది జగన్ ఆలోచన అని అందుకే 17 కళాశాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో 5 కళాశాలలను ఆల్రెడీ ప్రారంభించామన్నారు. నర్సీపట్నం మెడికల్ కాలేజీకి సంబంధించి 2023 సంవత్సంలో జీఓ నెంబర్ 39 ఇచ్చామని గుర్తుచేశారు.ఈ మెడికల్ కాలేజీని 500 కోట్లతో నిర్మించ నున్నామని జీవో ఇచ్చాం.. ఈ జోవోను చూసి అయినా కూటమి నేతలు మాట్లాడాలి కదా అని ప్రశ్నించారు. నర్సీపట్నంలో ల్యాండ్ లేదని, కాలేజీ లేదని, పర్మిషన్లు లేవని అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఇలా మాట్లాడిన నేతలు అంతా జగన్ కార్యక్రమానికి రావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. వస్తే వివరాలు అందిస్తామని.. కాలేజీ నిర్మాణం ఎంత వరకు వచ్చిందో కూడా చూపిస్తామని మాజీ మంత్రి విడదల రజనీ పేర్కొన్నారు.

## కాలిఫోర్నియాలో దీపావళి సెలవు

శానిఫ్రాన్సిస్కో, భారత్‌లో జరిగే అతిముఖ్యమైన పండగల్లో దీపావళికి ప్రత్యేకత ఉంది. దీపావళి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ దీన్ని ఘనంగా నిర్వహిస్తారు. తాజాగా కాలిఫోర్నియా ఈ పండగను అధికారిక సెలవు రోజుగా ప్రకటించింది. కాలిఫోర్నియా గవర్నర్ న్యూసమ్ ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండగను అమెరికాలో సెలవు రోజుగా ప్రకటించాలని ప్రతిపాదిస్తూ గతంలో ఆ దేశ కాంగ్రెస్‌లో ఓ బిల్లు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాన్ని కాలిఫోర్నియా స్టేట్ అసెంబ్లీ ఆమోదించింది. అసెంబ్లీ సభ్యుడు ఆష్ కల్రా ప్రవేశపెట్టిన బిల్లుపై తాను సంతకం చేశానని న్యూసమ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై గతంలో కల్రా మాట్లాడుతూ.. 'కాలిఫోర్నియాలో అత్యధికంగా భారతీయ అమెరికన్లు ఉన్నారు. ఈ పండుగ రోజును అధికారికంగా సెలవుగా ప్రకటిస్తే అది లక్షలాది మంది కాలిఫోర్నియా ప్రజల్లో సంతోషాలు నింపుతుంది. సద్భావన, శాంతి, ఉమ్మడి భావన అనే సందేశాలతో సమాజాన్ని ఈ పండగ ఒకచోట చేర్చుతుంది' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. పెన్సిల్వేనియా, న్యూయార్క్‌లు ఇప్పటికే దీపావళికి అధికారికంగా ఇలాంటి గుర్తింపును ఇచ్చాయి. తాజాగా భారతీయ పర్వదినానికి ఈ రకమైన గుర్తింపు ఇచ్చిన మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. ఈ నిర్ణయంతో ఇక్కడి ఎన్నారైలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పీకేకు శీల పరీక్ష!

పాట్నా:బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు తెరలేచింది. 243 స్థానాలు ఉన్న అసెంబ్లీ పోరులో కీలకమైన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్‌లు తలపడుతున్నాయి. అయితే..ఈ రెంటికీ నడుమ.. మరోవ్యూహాత్మక కొత్త పార్టీ జన్ సురాజ్ ఆవిర్భవించింది. గత ఏడాది ప్రారంభం లోనే పురుడు పోసుకున్న ఈ పార్టీకి రాజకీయ వ్యూహకర్తగా.. దేశవ్యాప్తంగా పేరున్న ప్రశాంత్ కిశోర్(పీకే) సారథ్యం వహిస్తున్నారు. ఆయన తన పార్టీని ప్రారంభించిన వెంటనే.. అనేక రూపాల్లో ప్రజలకు చేరువ అయ్యారు. సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకుంటున్నారు. యువతను కూడా చేరదీస్తున్నారు .అయితే...ఇప్పుడు 243 స్థానాల్లోనూ ఎవరితోనూ చేతులు కలపకుండా.. ఎవరికీ వంతపాడకుండా.. తానే రంగంలోకి దిగుతాన ని ఆయన చెబుతున్నారు. పటుతర సారథ్యం-ఘనతర నేపథ్యంతో బీహార్ భవితను తీర్చిదిద్దుతానని కూడా ఆయన హామీలు గుప్పిస్తున్నారు. అయితే.. ఇదేమంత తేలికైన విషయమా? అంటే.. కాదనే చెప్పాలి. ఎందుకంటే.. తాను పార్టీ ప్రారంభించిన తర్వాత.. రాష్ట్రంలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికతోపాటు.. పార్లమెంటు ఎన్నికలు కూడా వచ్చాయి. పార్లమెంటు ఎన్నికలకు దూరంగా ఉన్న పీకే.. అసెంబ్లీ స్థానాలకు మాత్రం యువతను బరిలోకి దింపారు. కానీ, వారు.. మూడు, నాలుగు స్థానాలకు మాత్రమే పరిమితమయ్యారు. ఇద్దరు డిపాజిట్ కూడా కోల్పోయారు.ఇప్పుడు పరిస్థితిని గమనిస్తే.. పీకేకు శీలపరీక్షేనని చెప్పాలి. ఎందుకంటే.. ఏపీలో వైసీపీ ప్రభుత్వాన్ని, 2014లో కేంద్రంలో బీజేపీ సర్కారును, తమిళనాట డీఎంకే సహా కర్నాటకలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చానని చెప్పే. ఆయన ఇప్పుడు సొంత గూటిలో సత్తా చాటుకునే పరిస్థితి ఆసన్నమైంది. అంటే.. పార్టీల జాతకాలను చెప్పే.. పీకే.. ఇప్పుడు తన జాతకాన్ని స్వయంగా నిర్దేశించుకునే పరిస్థితికి వచ్చారు. ప్రధానంగా.. కుల సమీకరణలకు ప్రాధాన్యం ఇచ్చే.. బీహార్‌లో యువతను ఆయన చేరదీశారు. తనదైన వాగ్ధాటితో.. సమస్యలు ప్రస్తావించి.. నిరుద్యోగం, ఆత్మగౌరవం, బీహారీల సత్తా.. అంటూ.. మూడు కీలక అంశాలను ప్రాతిపదికగా చేసుకుని ముందుకు సాగుతున్నారు.

## ఎవరి రాజకీయం వారిదే !

హైదరాబాద్,తెలంగాణ కేబినెట్‌లో మంత్రులు అంతా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అసలు తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా వారికి తెలుసో లేదో కానీ.. వివాదాల్లో మాత్రం ముందు ఉంటున్నారు. ఇలాంటి వాటి విషయంలో కఠినంగా ఉండాల్సిన సీఎం రేవంత్ అసలు ప ట్టించుకోవడం లేదు. అలాంటి అధికారం ఆయనకు హైకమాండ్ ఇవ్వలేదు. ఏమైనా ఉంటే శ్రీధర్ బాబుకు చెప్పుకోండి అన్నట్లుగా ఆయన ఉంటున్నారు. దీంతో మంత్రివర్గంలో మంత్రులు ఏం చేస్తున్నారో.. వారికే అర్థం కావడం లేదు.

పొన్నం, వివేక్, అడ్లూరి మధ్య ఆధిపత్య పోరాటం

పొన్నం ప్రభాకర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రి . ఆయన నోటి దురుసు కారణంగా అసలు వివాదం ప్రారంభమయింది. తన తోటి మంత్రి అని చూడకుండా ప్రెస్‌మీట్‌లో అడ్లూరి లక్ష్మణ్‌ను దున్నపోతు అని సంబోధించారు. వివేక్ కూడా.. తాను అందరి కంటే ఎక్కువ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దాంతో అడ్లూరి సహనం కోల్పోయి బయట పడ్డారు. దీంతో పెద్ద వివాదం అయిపోయింది. సీఎం పట్టించుకోలేదు కానీ.. పీసీసీ చీఫ్ మాత్రం మాట్లాడి సర్దుబాటు చేశానని చెప్పారు. ఇలాంటివి మాటలతో ముగిసిపోయే రాజకీయాలు కాదు.

## డిప్యూటీ సీఎం చాంబర్‌లో కదలని ఫైళ్ల 'కత'లు! ఆర్థిక ప్రయోజనాలుంటేనే మోక్షం?



హైదరాబాద్,ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, ఇతర ఉద్యోగుల బిల్లులు, ఉద్యోగుల పోస్టింగులు, చిన్న చిన్న పనులకు సంబంధించిన బిల్లులు.. ఇలా సాధారణమైన వివిధ రకాల బిల్లులకు చెందిన ఫైళ్లు నిత్యం పెండింగే ఇలాంటి సాధారణ ఫైల్ ఒకటి ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెండింగ్‌లోనే ఉందని సచివాలయ ఉద్యోగి ఒకరు చెప్పారు. సాధారణ ఫైళ్లను నిత్యం పెండింగ్ లో పెడుతున్న ఆర్థిక శాఖ బాధ్యతలు చూస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాత్రం ఆర్థిక ప్రయోజనాలున్న ఫైళ్లనే క్లియర్ చేస్తారన్న ఆరోపణలు సర్వత్రా వెలువడుతున్నాయి. ఆర్థిక శాఖలో కొన్ని ఫైళ్లు క్లియర్ అవుతాయి కానీ చిన్న వాళ్ల ఫైళ్లు క్లియర్ కావడం లేదని ఫైల్ క్లియరెన్స్ కోసం సచివాలయానికి వచ్చిన ఒకాయన వాపోయారు. ఆర్థిక శాఖ మంత్రి సంతకం చేయకపోవడం మూలంగానే తమకు వేతనాలు రావడం లేదని ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వేతనాలు రావాలంటే ప్రతి ఏటా బడ్జెట్ ఆమోదం పొందిన తరువాత ఆర్థిక మంత్రి ఫైనాన్స్ కాంకరెన్స్ ఇస్తూ సంబంధిత ఫైల్‌పై సంతకం చేస్తేనే వేతనాలు వస్తాయని ఆయన తెలిపారు. ఈ ఫైల్ పై సంతకం చేయకపోవడం వల్లనే వేతనాలు ఆగిపోయాయి. ఇరత బిల్లుల పరిస్థితి కూడా అదే తీరుగా ఉన్నది.

ఒక్క సంతకంపై 2 లక్షల మంది జీతాలు!

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలంటే అసెంబ్లీలో బడ్జెట్ ఆమోదం పొందిన తరువాత ఫైనాన్స్ కాంకరెన్స్ ఇస్తూ ఆర్థిక శాఖ మంత్రి సంతకం పెట్టాలి. ఆయన ఒక్క సంతకంపై ఆధారపడి 2 లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపు ఆధారపడి ఉన్నది. తరువాత చూద్దాంలే అంటూ ఇప్పటి వరకు సంతకం పెట్టకపోవడంతో ఇంత వరకు వారికి వేతనాలు అందడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చివరకు కార్మికశాఖ సంక్షేమ బోర్డులో దాదాపు రెండు వేల కోట్ల రూపాయల డిపాజిట్లు ఉన్నా కూడా డిప్యూటీ సీఎం ఆ ఫైల్ పై సంతకం చేయకపోవడం వల్లనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేక పోతున్నామని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే వేతనం రాక ఒక ఔట్ సోర్సింగ్ ఉ ద్యోగి బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. నెలకు 10 నుంచి 20 వేల రూపాయల మధ్య వేతనం వచ్చే ఈ చిరుద్యోగులు వేతనాలు రాక ఇంటి ఖర్చులు వెళ్లదీయలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అయినా ఈ డిప్యూటీ సీఎంకు మాత్రం వీరిపై కనీస దయ, కనికరం లేకపోయిందని సచివాలయ ఉ ద్యోగి ఒకరు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ పోస్టింగ్ ఫైళ్లు కూడా ఈ ఆర్థిక శాఖ మంత్రి పెండింగ్ లో పెడుతున్నారన్న చర్చ సచివాలయ వర్గాలలో జరుగుతున్నది. సకాలంలో ఫైల్ పై సంతకం చేయకపోవడం వల్ల కొంత మంది అధికారులు పోస్టింగ్ లేక, వెయిటింగ్‌లో ఏడాది కాలంగా ఉంటున్నారని అంటున్నారు. సదరు అధికారులు చేయాల్సిన పని ప్రదేశం ఖాళీగా ఉండటంతో మరో అధికారికి అదనపు బాధ్యతలు ఇవ్వాల్సి వస్తున్నది. దీంతో అడిషనల్ వర్క్ చేసిన అధికారికి అదనపు వేతనం ఇవ్వాల్సి వస్తుందని చెబుతున్నారు. తరువాత సదరు అధికారికి ఎప్పుడు పోస్టింగ్ ఇచ్చినా వెయిటింగ్ పిరియడ్ వేతనం మొత్తం తీసుకుంటారని, ఫలితంగా ఆర్థిక శాఖకు అదనపు భారమే అవుతుందని సచివాలయ బిజినెస్ రూల్స్ తెలిసిన ఒక అధికారి చెప్పారు. అదే మంత్రి వెంట వెంటనే ఫైల్ క్లియర్ చేస్తే ఈ అదనపు బాదుడు ఉండదని అన్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా ఫైల్స్ చూసుకోవాలని, కానీ దీనికి భిన్నంగా మరో సారి చూద్దాంలే తొందరేముందంటే అధికారులు ఏమి సమాధానం చెపుతారని మరో అధికారి నిట్టూర్చారు.

ఉద్యోగులకు మొండి చెయ్యే..

తమ బకాయిలు రూ.10 వేల కోట్లు కనీసం విడుతల వారీగా నైనా చెల్లించాలని ఉద్యోగుల జేఏసీ ఒకసారి సమ్మెకు పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. నెలకు రూ.700 కోట్లైనా విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు ప్రభుత్వం ఇవ్వాల్సిన వారి సొమ్ము కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మరో వైపు ఆరోగ్యశ్రీ బకాయిల కోసం నెట్ వర్క్ ఆసుపత్రులు ఇప్పటికే పలు సార్లు సమ్మె చేస్తామని హెచ్చరించాయి. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు, ప్రైవేట్ కళశాలల యజమాన్యాలు కూడాఆందోళనలు చేపట్టాయి. చిన్న కాంట్రాక్టర్లు తమ బిల్లుల కోసం ఏకంగా డిప్యూటీ సీఎం చాంబర్ ముందే ధర్నాలు చేశారు. ఆర్థిక శాఖ మంత్రి రోజు వారి ఫైళ్లు క్లియర్ చేస్తే ఇలాంటి పరిస్థితులు తలెత్తవని సీనియర్ అధికారులు అంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏనాడూ లేని విధంగా ఆర్థిక శాఖ కారిడార్ ముందు పోలీస్ భద్రత ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండదని చెపుతున్నారు.

గత మంత్రులతో పోలిక

ప్రస్తుత ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పనితీరును గత ఆర్థిక మంత్రుల పనితీరుతో పలువరు సచివాలయ ఉన్నతాధికారులు పోల్చి చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం ఉమ్మడి రాష్ట్రానికి ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన మాజీ ముఖ్యమంత్రి రోశయ్య పనితీరును గుర్తు చేసుకుంటున్నారు. రోశయ్య జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడు మినహా హైదరాబాద్‌లో ఉంటే ఏ రోజు ఫైళ్లు ఆ రోజే క్లియర్ చేసే వారని చెపుతున్నారు. ఏ కారణం చేతనైనా హైదరాబాద్‌లో ఉండి సచివాలయానికి రాలేక పోతే తను ఉన్న దగ్గరికే ఫైళ్లు తెప్పించుకొని క్లియర్ చేసి పంపించే వాడని గుర్తు చేసుకున్నారు. దీంతో చాలా మందికి ఫైళ్ల కోసం ఎదురు చూడ కుండ సంతోషంగా వెళ్లే వాళ్లని అప్పట్లో ఆర్థిక శాఖలో పని చేసిన ఒక అధికారి నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. అలాగే టీడీపీలో ఆర్థిక మంత్రిగా పని చేసిన యనమల రామకృష్ణుడు సైతం ఎప్పటికప్పుడు ఫైళ్లు క్లియర్ చేసేవారని చెపుతున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు అయిన తరువాత ఆర్థిక మంత్రిగా బాధ్య తలు నిర్వర్తించిన ఈటల రాజేందర్ ఏ ఫైల్ ఎలా ఉన్నా సామాన్యులకు చెందిన ఫైళ్లను మాత్రం వెంటనే క్లియర్ చేసే వాడని చెపుతున్నారు. గత ఆర్థిక శాఖ మంత్రుల తీరుకు భిన్నంగా ప్రస్తుత మంత్రి తీరు ఉన్నదని అధికార వర్గాలలో చర్చ జరుగుతున్నది. ఫైళ్లు పెండింగ్ లో పెట్టడంలో మాజీ సీఎం కేసీఆర్‌కు వారసుడిలా ఉన్నట్లు అర్థం అవుతోందని ఒక అధికారి నిట్టూర్పు విడిచారు.

## అక్షరాస్యతలో మహిళలు,పురుషుల మధ్య 16 శాతం గ్యాప్!



న్యూఢిల్లీ, దేశంలో అక్షరాస్యత రేటు పెరిగింది. అయితే పురుషులు, మహిళల మధ్య అక్షరాస్యతలో మాత్రం 16.68 శాతం తేడా ఉందని 2011 జనాభా లెక్కలు పేర్కొంటున్నాయి. ప్రతి ఏటా మహిళల అక్షరాస్యత రేటు పెరుగుతోంది. కానీ, పురుషులతో సమానంగా ఆ పెరుగుదల ఉండటం లేదు. మరి ఈ సారి జనాభా లెక్కల్లో ఎలాంటి వివరాలు వెల్లడవుతాయో!ఒక దేశంలో చదవడం, రాయడం తెలిసిన వ్యక్తుల శాతాన్ని అక్షరాస్యత రేటు అంటారు. దీని ద్వారా ఒక ప్రాంతంలో ఎంతమంది విద్యావంతులున్నారో తెలుసుకోవడానికి సహాయపడుతుంది. అంటే ఒక నిర్దిష్ట జనాభాలో ఒక్క భాషలోనైనా అర్థం చేసుకుని చదివి, రాసే వ్యక్తుల జనాభాను లేదా శాతాన్ని సూచించేదే అక్షరాస్యత రేటు. దీని ద్వారా ఆయా ప్రాంతం లేదా ఆ దేశంలో ఉన్న జనాభా విద్యాస్థాయి తెలిసే అవకాశం ఉంది. 15 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయస్సు ఉ న్నవారు లేదా ఏడు సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లల విద్యార్హతలను అక్షరాస్యత రేటు ద్వారా తెలుసుకోవచ్చు. లిటరసీ రేటు సామాజిక అభివృద్ధికి ముఖ్యమైన సూచికగా పనిచేస్తుంది. మొత్తం అక్షరాస్యుల సంఖ్యను మొత్తం జనాభాతో భాగించి వందతో గుణిస్తే వచ్చేదే అక్షరాస్యత రేటు.

పురుషులు, మహిళల అక్షరాస్యత మధ్య గ్యాప్

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947లో ఇండియాలో అక్షరాస్యత 12% మాత్రమే. 1951 జనాభా లెక్కల ప్రకారంగా దేశంలో మొత్తం అక్షరాస్యత శాతం 18.33కి చేరుకుంది. అయితే ఇందులో మహిళల లిటరసీ రేటు 8.86 శాతం. పురుషుల లిటరసీ రేటు 27.16 శాతం. పురుషులు, మహిళల మధ్య అక్షరాస్యత శాతంలో 18.30 శాతం తేడా ఉంది. 1961 నాటికి దేశంలో అక్షరాస్యత 28.30 శాతానికి చేరింది. ఇందులో పురుషుల వాటా 40.40%గా ఉంది. మహిళలు 15.15 శాతానికి చేరారు. 1971నాటికి పురుషుల కంటే సగటున మహిళల అక్షరాస్యత శాతం పెరిగింది. అప్పట్లో మొత్తం 34.45 శాతం లిటరసీ రేటు నమోదైంది. ఇందులో పురుషులు 45.95 శాతంగా ఉంటే, 21.97 శాతం మంది మహిళలు అక్షరాస్యులయ్యారు.1981లో మొత్తం 43.57 మంది అక్షరాస్యులయ్యారు. ఈ సమయంలో పురుషుల అక్షరాస్యత శాతం బాగా పెరిగింది. 56.38 శాతం మంది పురుషులు చదువుకున్నారు. ఇక మహిళల్లో 29.76 మంది మాత్రమే చదువుకున్నారు. 1991 నాటికి దేశంలో 52.21 మంది అక్షరాస్యులైతే పురుషుల్లో 64. 13 శాతం మంది పురుషులున్నారు. ఇక మహిళల్లో 39.29 శాతం మంది ఉన్నారు. 2001లో దేశంలో అక్షరాస్యత 65.38 శాతానికి చేరింది. అయితే ఇందులో మహిళలు 54.16కు చేరింది. పురుషుల అక్షరాస్యత శాతం 75.85 కి చేరింది. ఇక 2011 జనాభా లెక్కల ప్రకారం 74.04 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. ఇందులో పురుషుల లిటరసీ రేటు 82.14 శాతం, మహిళల అక్షరాస్యత శాతం 65.46 శాతంగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి.

అక్షరాస్యతలో మిజోరాం టాప్

2011 తర్వాత దేశంలో జనాభా లెక్కలు జరగలేదు. వాస్తవానికి 201లో జనాభా లెక్కలు తీయాలి. అయితే అప్పట్లో కరోనా కారణంగా జనాభా లెక్కలు తీయలేదు. 2026 అక్టోబర్ నుంచి రెండు విడతల్లో జనాభా లెక్కలను తీస్తారు. అంటే ఈ జనాభా లెక్కలను 2027లో విడుదల చేస్తారు. అయితే స్టాటిస్టా ప్రకారం 2022లో దేశ అక్షరాస్యత దాదాపు 76.32 శాతంగా ఉంది. రాష్ట్రాల మధ్య అక్షరాస్యత రేటులో గణనీయమైన తేడాలున్నందున డేటా ఇంకా పూర్తి కాలేదు. అయితే దీనికి విరుద్ధంగా పీఎల్ఎఫ్ఎస్ 2023-24 ఎంఎస్‌పీఐ సర్వే (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్) ప్రకారం ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో దేశంలో అత్యల్ప అక్షరాస్యత రేటు నమోదైంది. 2023%-%24 సంవత్సరం నాటికి దేశంలో మొత్తం అక్షరాస్యత 80.9 శాతానికి చేరింది. ఈ సర్వే ప్రకారం మిజోరం రాష్ట్రం అక్షరాస్యత్‌తో 98.2 శాతంతో టాప్ లో నిలిచింది. 97.3 శాతంతో ఆ తర్వాతి స్థానంలో లక్షద్వీప్ నిలిచింది. నాగాలాండ్ 95.7 శాతంతో నాగాలాండ్ ఉంది. గతంలో టాప్ లో ఉన్న కేరళ రాష్ట్రం 95.3 శాతంతో నాలుగో స్థానంలో ఉంది. 94.2 శాతంతో ఐదో స్థానంలో మేఘాలయ నిలిచింది. 93.7 శాతంతో త్రిపుర, చండీగఢ్ రాష్ట్రాలు ఆరు, ఏడు స్థానాల్లో ఉన్నాయి. ఇక ఎనిమిదో స్థానంలో 93.6 శాతంతో గోవా ఉంది. 92.7 శాతంతో పాండిచ్చేరి తొమ్మిది, 92 శాతంతో మణిపూర్ పదో స్థానంలో ఉంది. ఈ సర్వే ప్రకారం 72.6 శాతంతో అక్షరాస్యత రేటులో ఆంధ్రప్రదేశ్ వెనుకబడింది. బీహార్ లో 74.3 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. మధ్యప్రదేశ్ లో 75.2 శాతం, రాజస్థాన్ లో 75.8 శాతం, జార?ండ్ లో76.7 శాతం,తెలంగాణలో 76.9 శాతం, ఉత్తర్ ప్రదేశ్ లో78.2 శాతం, చత్తీస్ గఢ్ లో 78. 5 శాతం, లడక్ లో81 శాతం, జమ్మూ కశ్మీర్ లో 82 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది.

2027 జనాభా లెక్కల్లో మహిళల అక్షరాస్యత పెరిగేనా?

ఇప్పటి వరకు ఉన్న జనాభా లెక్కల ప్రకారంగా మహిళల అక్షరాస్యత శాతం పురుషులతో పోలిస్తే తక్కువగానే ఉంది. అయితే చదువుకు ప్రాముఖ్యత పెరిగింది. పురుషులతో సమానంగా మహిళలు చదువుకుంటున్నారు. ఉత్తీర్ణతా శాతాల్లో తరచూ బాలికలే టాప్‌గా నిలుస్తున్నారు. అయితే ఇది ఏ మేరకు పెరిగిందనేది 2027 జనాభా లెక్కల్లో తేలనుంది. పీఎల్ఎఫ్ఎస్ 2023-24 ఎంఎస్‌పీఐ సర్వే ప్రకారం దేశంలో అక్షరాస్యత రేటు 80.9 శాతం. పట్టణ ప్రాంతాల్లో పురుషుల్లో 92.9 శాతం మంది అక్షరాస్యులైతే, 84.9 శాతం మంది మహిళలు అక్షరాస్యులున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో 84.7 శాతం పురుషులు అక్షరాస్యులుంటే 70. 4 శాతం మంది మాత్రమే మహిళలు అక్షరాస్యులుగా నమోదయ్యారు. సామాజిక కట్టుబాట్లు,పేదరికం, బాల్య వివాహాలు, లింగ వివక్ష వంటి అంశాలు మహిళల అక్షరాస్యతపై ప్రభావం చూపాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటికి ఇప్పటికీ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. అయితే ఈ మార్పులు పురుషులతో సమానంగా మహిళలు అక్షరాస్యతను ఇంకా సాధించలేదు. మహిళల్లో అక్షరాస్యత రేటును పెంచేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇవి కొన్ని ఫలితాలను ఇస్తున్నాయి. దీని కారణంగానే మహిళల అక్షరాస్యత పెరిగేందుకు కారణం అవుతున్నాయి. మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.

## గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటాం

హైదరాబాద్,గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. గన్ పార్కు అమరవీరుల స్తూపం వద్ద గ్రూప్-1 అభ్యర్థులు చేపట్టిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిలిమ్స్ పరీక్షల నుంచే అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేరు కోసం బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దని చెప్పారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి ఉ ద్యోగాల కోసం కష్టపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. పారదర్శకంగా పరీక్షలు పెట్టండి. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక పాత ఉద్యోగాలే ఇచ్చారు. ఇవి తప్పుడు పరీక్షలు. కాంగ్రెస్ కోసం వారిని ఎంపిక చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడాలి. మిమ్మల్ని విద్యార్థులు నమ్మారు.. వారి పక్షాన నిలబడండి. మూల్యాంకనం సరిగా జరగాలి. కోర్టుల్లో జడ్జీలకు అర్థం అయ్యేదాకా పోరాటం చేస్తాం. గ్రూప్-1 నియామకాలను రద్దు చేసి.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బుధవారం నిరసనకు దిగారు. నిరుద్యోగులకు మద్దతుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విద్యార్థుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కొంత మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి గ్రూప్ 1 పెట్టారా అని ప్రశ్నించారు. తెలిసో తెలియకనో గత పదేళ్లలో గ్రూప్ 1 పెట్టలేదన్నారు. నిరుద్యోగులతో అధికారంలోకి వచ్చి వాళ్ళనే రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పరీక్ష రాసిన విద్యార్థులు.. ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు రాసిన పేపర్లు బయట పెట్టమని అడుగుతున్నారన్నారు. 50 వేల పాత ఉద్యోగాలు ఇచ్చి తాము ఇచ్చినం అని అంటున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ హరగోపాల్‌ను స్వయంగా కలుస్తామని.... వ్యవస్థ ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులలో నిరుద్యోగులను మోసం చేస్తే కుర్చీలో నుంచి తీసి బయట పడేస్తారని హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ మీటింగ్ ఉందన్నారు. ప్రజా ఆగ్రహానికి గురికావొద్దని ప్రభుత్వానికి సూచించారు. ఉద్యోగాలు వచ్చిన వారిపై తమకు కోపం లేదని.. అక్రమంగా తెచ్చుకున్న వారిపైనే కోపమని కవిత స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌లో సమిసిన పంచాయితీ

హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల ఏర్పడిన అంతర్గత విభేదాలు సర్దుబాటు అయ్యాయి. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య చెలరేగిన వివాదానికి తెరపడింది. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చొరవ తీసుకుని ఇరు నేతలకు సర్దిచెప్పడం తో సమస్య పరిష్కారమైంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ భేషరతుగా క్షమాపణ తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నివాసంలో ఈ మంత్రులిద్దరూ భేటీ అయ్యారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నివాసంలో ఇరువురు మంత్రుల మధ్య సయోధ్య కుదిరింది. బుధవారం ఉదయం పీసీసీ చీఫ్ నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో అడ్లూరికి పొన్నం క్షమాపణలు చెప్పారు. దీంతో ఇరువురి మధ్య వివాదం ముగిసింది. దీనిపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల మరో మంత్రి లక్ష్మణ్ నొచ్చుకోవడంతో యావత్ సమాజం కొంత బాధపడిందన్నారు. మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్యగా వెల్లడించారు. జరిగిన సంఘటన పట్ల చింతిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలని తెలిపారు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజిక వర్గానికి పీసీసీ చీఫ్ విజ్ఞప్తి చేశారు. ఎక్కడ మాట్లాడినా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సహచర మంత్రివర్గానికి కూడా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహాయంతో కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు చట్టాలు తీసుకొచ్చామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పొన్నం క్షమాపణ కోరడంతో ఈ సమస్య ఇంతటితో సమసిపోయిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తా.. కానీ ఆయన వాఖ్యల పట్ల మాదిగ జాతి బాధపడింద న్నారు. అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు. జెండా మోసిన తనకు మంత్రిగా అవకాశం ఇచ్చారని... పార్టీ లైన్ దాటే వ్యక్తిని కానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నేను ఆ మాట అనకపోయినా క్షమాపణలు చెబుతున్నా. పత్రికా కథనాలతో మంత్రి అడ్లూరి మనస్తాపం చెందారు. అందుకే ఆయనకు క్షమాపణలు చెబుతున్నా. మంత్రి అడ్లూరికి, నాకు పార్టీ సంక్షేమం తప్ప మరో ఉద్దేశం లేదు. కాంగ్రెస్ నేతలమంతా సామాజిక న్యాయం కోసం పని చేస్తాం అని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఓ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నట్లుగా వ్యాఖ్యలు సోషల్‌మీడియా లో రావడం.. వాటిపై లక్ష్మణ్‌కుమార్ ఓ వీడియో విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. తనపై పొన్నం అనుచిత వ్యాఖ్యలు చేశారని, మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలని అందులో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరు మంత్రుల మధ్య ఉన్న విభేదాలు.. ఇప్పుడు బహిర్గతమయ్యాయన్న చర్చ జరిగింది. తాజాగా బుధవారం మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్య నేతల చొరవతో పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య వివాదం ముగిసింది. దీంతో పార్టీలో ఐక్యతను రక్షించేందుకు సంకేతం ఇచ్చారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అడ్లూరి లక్ష్మణ్ ఇబ్బంది పడ్డారు. అందుకే భేషరతుగా క్షమాపణ చెప్పడం జరిగింది. అన్ని విషయాలు కుటుంబ సంబంధ సమస్యలుగా మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు ఈ సమస్యను ఇంతటితో ముగించాలనే కోరుతున్నాను అని స్పష్టం చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అండగా ఉంటుంది. ప్రతి కార్యకర్త, నాయకుడు ఐక్యంగా పని చేయాలని కోరుకుంటున్నాం అని చెప్పారు.

## రెండు దగ్గుమందులపై నిషేధం

హైదరాబాద్, రెండు దగ్గు మందులను నిషేధిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రీలైఫ్, రెస్పిఫ్రెష్-టీఆర్‌ను విక్రయించొద్దంటూ అందులో పేర్కొంది. ఈ రెండు దగ్గు మందుల్లోనూ కల్తీ జరిగినట్లు గుర్తించారు. వీటిని గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీల ఔషధాలుగా పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు మందు వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే 'కోల్డ్ రిఫ్'ను పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఔషధ నియంత్రణ విభాగం డీసీఏ ప్రకటించింది. చిన్నారులలో తీవ్రమైన రోగాల్ని, మరణాలను కలిగిస్తున్న ప్రమాదకర దగ్గు మందులను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిస్తూ చర్య తీసుకుంది. రీలైఫ్, రెస్పిఫ్రెష్-టీఆర్ అనే రెండు సిరప్‌లను విక్రయించరాదు అని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది.

# రాజకీయ భారతీయుడు...డీఎంకేకి మంచి మిత్రుడు



న్యూఢిల్లీ,ఇప్పటికి ముప్పయ్యేళ్ళ క్రితం భారతీయుడు సినిమా వచ్చింది. అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అర్ధ శతాబ్దం అయింది. కేంద్రంలో ప్రభుత్వాలు కూడా స్థిరంగా ఉండని స్థితి. అంతే కాదు అన్ని విధాలుగా విసిగి జనాలు ఉన్నారు. ఆ సమయంలో వెండి తెర మీద అవినీతి అక్రమాల మీద విక్రమార్కుడి మాదిరిగా డెబ్బై ఏళ్ళ భారతీయుడు విరుచుకుపడి విశ్వరూపం ప్రదర్శిస్తూంటే జనాలు జేజేలు పలికారు. భారతీయుడు లాంటి వారు ఒక్కరు ఉండాలి కదా అని చప్పట్లు కొట్టారు. అది రాజకీయ వాసనలు ఉన్న చిత్రం, అలా కొన్ని సినిమాలు కమల్ చేసి వెండి తెర మీద నటుడిగా రంజింపచేశారు.

లెఫ్ట్ ఈజ్ రైట్ అంటూ :

ఇక కమల్ నిజ జీవితంలో లెఫ్టిస్ట్ ఫిలాసఫీని ఇష్టపడతారు. ఆయన తన భావాలను ఎక్కడా దాచుకోలేదు. సందర్భం దొరికిన ప్రతీ సారీ చెబుతూ వస్తూనే ఉన్నారు. అలా తనకంటూ ఒక సొంత పార్టీని స్థాపించారు. దాని పేరు మక్కల్ నీది మయ్యం. ఆ పార్టీ తరఫున 2021లో తమిళనాడులో మొత్తం అన్ని అసెంబ్లీ సీట్లకు పోటీ చేసి తాను కూడా అసెంబ్లీకి నెగ్గలేక ఓటమి పాలు అయ్యారు. ఆ తరువాత ఆయన 2024 ఎన్నికల్లో పోటీ చేయలేదు. డీఎంకేకి మద్దతు ఇచ్చారు. ఫలితంగా ఆ పార్టీ నుంచి రాజ్యసభ సీటు అందుకుని ఎంపీ అయ్యారు. దాంతో కమల్ రాజకీయం పెద్దల సభ మెట్లు ఎక్కినట్లు అయింది.

ఏవీ కమల్ అంటూ :

ఏవి తల్లి నిరుడు కురిసిన హిమ కుసుమములు అంటూ నిర్వేదం చెందాల్సిన స్థితి అని అన్నట్లుగానే ఉందా కమల్ ప్రస్తుత స్థితి అన్నది ఒక విశ్లేషణ. ఆయన మీద గతంలో విమర్శలు రాజకీయంగా ఎన్ని వచ్చినా ఈ తరహాలో రాలేదు. ఇపుడు మాత్రం బీజేపీ దుమ్మెత్తి పోస్తోంది. తాజాగా గట్టిగానే కామెంట్స్ చేసింది. దానికి కరణం కమల్ తాజాగా చేసిన పర్యటన. గత నెల 27న కరూర్ పట్టణంలో సినీ నటుడు విజయ్ నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఏకంగా 42 మంది దాకా మరణించరు. తాజాగా కమల్ హాసన్ స్థానిక డీఎంకే నేతలతో కలిసి కరూర్ దుర్ఘటన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది దురదృష్టకరమైన ఘటన అయినప్పటికీ ప్రభుత్వ వైఫల్యం కాదని అన్నారు. పోలీసులు తమ విధిని సక్రమంగా నిర్వర్తించారని మెచ్చుకున్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా బగా వ్యవహరించారని కితాబిచ్చారు. దీంతోనే బీజేపీ నేతలకు మంటెక్కింది.

ఆత్మ గౌరవం ఏదీ అంటూ :

కమల్ హాసన్ మీద తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై ఒక లెవెల్ లో విమర్శలు చేశారు కమల్ తన కోసం కేవలం ఒక్క రాజ్యసభ సీటు కోసం తన రాజకీయ పార్టీని తనకు ఉన్న ఆత్మగౌరవాన్ని అధికార డీఎంకే పార్టీకి అమ్ముకున్నారని అన్నామలి తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా కమల్ హాసన్ మాట్లాడటం మీద ఆయన ఫైర్ అయ్యారు. కమల్ కేవలం పెద్దల సభలో అడుగు పెట్టడానికి తన అంతరాత్మను సైతం అమ్ముకున్నారని దుయ్యబెట్టారు. కరూర్ బాధితులను పరామర్శించడానికి వెళ్లి ప్రభుత్వం తప్పులేదని సర్టిఫికేట్ ఇస్తారా కమల్ అని ప్రశ్నించారు. అసలు ఎందుకు మీరు ఇంతగా దిగజారిపోతున్నారు అని కూడా నిలదీశారు. ఇవన్నీ ఎలా ఉన్నా కమల్ హాసన్ ఏమి చెప్పినా తమిళనాడు ప్రజలు ఆయను పట్టించుకునే స్థితిలో కూడా లేరని అన్నామలై సెటైర్లు వేశారు.

అది ఒక్కటీ చాలునా :

కమల్ హాసన్ తన పార్టీ ద్వారా కొత్త రాజకీయం తీసుకుని వస్తామని చెప్పారు. అయితే అది అసాధ్యమని ఆయన భావించారో లేక తాను పార్టీని నడపలేనని అనుకున్నారో ఒక ఎంపీ సీటుకే పరిమితం అయిపోయారా అని ఆయన అభిమానులు కూడా అంటున్నారు. అయితే సినిమా వారికి రాజకీయాలు చేయడం అంటే కత్తి మీద సాము అన్నది కూడా ఉంది. రీల్ లైఫ్ వేరు రియల్ లైఫ్ వేరు అన్నది కూడా చెబుతారు. సో కమల్ చేసినది మంచి పని అన్న వారు ఉన్నారు. మొత్తానికి ఆయన వెండి తెర భారతీయుడు కావచ్చేమో కానీ బయట మాత్రం మామూలు నాయకుడు అని అన్న వారూ ఉన్నారు. అదన్న మాట నాయకన్ మార్క్ పాలిటిక్స్ అని బీజేపీ విమర్శలు చేస్తోంది.

# ఆ తప్పే చేస్తే... బీహారూ దక్కదు రాహుల్!



న్యూఢిల్లీ,రాజకీయాల్లో ఉన్నవారు.. ఒకసారి చేసిన తప్పును మళ్లీ మళ్లీ చేయడం సరికాదని అంటారు. కానీ, అదేంటో.. అతి ప్రాచీన పార్టీగా.. ఉద్ధండులను దేశానికి అందించిన పార్టీగా పేరొందిన కాంగ్రెస్ మాత్రం తప్పులపై తప్పులు చేస్తూనే ఉంది. ఫలితంగా రాష్ట్రాలను కూడా చేజార్చుకుంటూనే ఉంది. మరి ఈ తప్పులకు ఇప్పుడైనా చెక్ పెడతారా? ఇకనైనా బీహార్‌లో పుంజుకుం టారా? అనేది చూడాలి. ఈ క్రమంలో అసలు ఇప్పటి వరకు కాంగ్రెస్ తప్పులు చేసి.. చేతులు కాల్చుకున్న పరిణామాలు చూద్దాం..

1) ఢిల్లీలో ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఎన్నికల్లో కేజ్రీవాల్‌తో పొత్తు పెట్టుకునేందు ముందుగానే కాంగ్రెస్ చేతులు చాపాలని పార్టీ సీనియర్లు చెప్పారు. కానీ, రాహుల్ ససేమిరా అన్నారు. చివరకు చింతన్ శిబిర్‌లో కూడా.. ఏఐసీసీ చీఫ్.. మల్లికార్జున ఖర్గే ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో సర్దుకు పోదాం.. కొంతలో కొంతైనా మేలు జరుగుతుందన్నారు. కానీ, వింటేనా.. చివరి దాకా సాగదీశారు. దీంతో ఆప్.. ఎదురు తిరిగింది. అసలు కాంగ్రెస్‌తో చేతులు కలిపేది లేదని తేల్చి చెప్పింది. ఫలితంగా అటు ఆప్ మాట ఎలా ఉన్నా.. దేశరాజధానిలో కాంగ్రెస్ అడ్రస్ కొలాప్స్ అయింది.

2) జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఎన్నికల్లోనూ ఫరూక్ అబ్దుల్లా పార్టీతో పొత్తుకు రెడీ కావాల్సిన పార్టీ.. చేతులు ముడుచుకుంది. ఫలితంగా ఆ పార్టీకి కూడా ఆగ్రహం పెల్లుబికి.. చివరకు కాంగ్రెస్‌ను తమ పొత్తు పార్టీ కాదని ప్రకటించి.. పరోక్షంగా బీజేపీకి వత్తాసు పలికింది. దీంతో కనీసంలో కనీసం 12 స్థానాలు దక్కుతాయని భావించిన కాంగ్రెస్ ఒకటి రెండుకు పరిమితమైంది.

3) హిమాచల్ ప్రదేశ్, జార?ండ్‌లలోనూ.. ఇలానే చివరకు వరకు సాగదీసిన కాంగ్రెస్‌పార్టీ.. అక్కడ కూడా ప్రాభవం కోల్పోయింది. ఇలా.. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లోనే కాంగ్రెస్ తప్పులపై తప్పు చేసింది.

ఇప్పుడు బీహార్ వంతు చూద్దాం..

ఇక, బీహార్ విషయానికి వస్తే.. ఇక్కడ బలమైన ప్రాంతీయ పార్టీ ఆర్జేడీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. ఇంత వరకుబాగానే ఉంది. అనేకు ఉద్యమాలు, నిరసనలు, ఓట్ అధికార యాత్రలు అంటూ.. ప్రజల్లోకి వచ్చింది. దీంతో అంతో ఇంతో కాంగ్రెస్ బలం పుంజుకుంది. కానీ.. ఇదేసమయంలో పొత్తు ధర్మం పాటించండి! మహాప్రభో అంటూ.. ఆర్జేడీ బతిమాలుతున్నా.. కాంగ్రెస్ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రెండు విషయాల్లో కాంగ్రెస్ పార్టీ నాన్చుడు ధోరణిని అవలంబిస్తోంది. దీంతో ఇక్కడ కూడా అదే తప్పు చేస్తున్నట్టు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

1) సీట్ల పంపకం: పొత్తులో భాగంగా కాంగ్రెస్-ఆర్జేడీ-సీపీఎం-సీపీఐ సహా.. చిన్న చితకా పార్టీలు సీట్లు పంచుకోవాల్సి ఉంది. ఈ విషయంపై ఏదో ఒకటి తేల్చాలని కీలకమైన ఆర్జేడ నేత కోరుతున్నారు. కానీ, కాంగ్రెస్ ఇప్పటికీ మౌనంగానే ఉంది. మరో వైపు.. షెడ్యూల్ కూడా ప్రకటించారు.

2) సీఎం సీటు: బీహార్‌లో పొత్తులు ఉన్నా.. కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్‌లో అతి పెద్ద పార్టీ.. ఆర్జేడీనే. దీంతో సీఎం సీటు తమకే కావాలని తేజస్వి పట్టుబడుతున్నారు. పైగా.. ఇటీవల ఒపీనియన్ పోల్ చేసి సర్వేలోనూ.. నితీష్ తర్వాత.. సీఎం గా ప్రజలు కోరుతున్న నాయకుడు తేజస్వి అని తేలింది. అయితే.. ఈ విషయంలో ఏదో ఒక ప్రకటన చేసేందుకు కాంగ్రెస్ ముందుకు రావడం లేదు. కానీ, తేజస్విమాత్రం తానే సీఎం అభ్యర్థినని.. తనను కాదంటే ఒంటరిపోరుకు సిద్ధమని ప్రకటిస్తున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులు రెచ్చగొడుతున్నారు. ఆర్జేడీకి మాత్రమే ఆయన సీఎం అని.. మహాఘట్ బంధన్‌కు కాదని అంటున్నారు. ఈ విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ మౌనంగానే ఉంది. ఇలా.. గతంలో చేసిన తప్పులతో ముప్పు తెచ్చుకున్న ప్రాచీన పార్టీ.. ఇక్కడైనా వాటిని సరిదిద్దుకోలేక పోతే.. కష్టమేనని చెబుతున్నారు పరిశీలకులు.

# జగన్ విత్ మోడీ : ట్వీట్ తో గ్రీట్ !

అమరావతి,ఏపీలో రాజకీయం ఎవరికీ అంతు పట్టకుండా ఉంది. ఎందుకంటే ఏపీలో టీడీపీ కూటమి అధికారంలో ఉంది. టీడీపీ కూటమి అంటే అందులో జనసేన బీజేపీ కూడా ఉనాయి. ఈ మూడు పార్టీలు ఎన్డీయేగా ఏపీలో పాలన సాగిస్తున్నాయి. ఈ మూడు పార్టీలే ఏపీలో 2024 మధ్య వరకూ అధికారంలో ఉన్న వైసీపీని పట్టు బట్టి మరీ గద్దె దించేశాయి. దాంతో సహజంగానే వైసీపీకి ఈ మూడు ప్రతిపక్షమే కావాలి. కానీ వైసీపీ మాత్రం టీడీపీనే గట్టిగా టార్గెట్ చేస్తోంది. అదే సమయంలో అపుడపుడైనా జనసేనని విమర్శిస్తుంది, కానీ బీజేపీని పల్లెత్తు మాట అనదు. దాంతో పాటుగా కేంద్రంలోని బీజేపీ పెద్దలకు అవసరమైన సందర్భాలలో మద్దతు కూడా ఇస్తుంది. దానికి తాజా ఉదాహరణ ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ బీజేపీ అభ్యర్థికి ఓటు వేయడం.

మోడీకి కంగ్రాట్స్ :

తాజాగా చూసుకుంటే నరేంద్ర మోడీకి ఏపీలో వైసీపీ అధినేత జగన్ కంగ్రాట్స్ చెప్పారు. ఎందుకు అంటే మోడీ పాతికేళ్ళ అధికార రాజకీయ ప్రస్తానం మీద గుజరాత్ సీఎం గా మోడీ తన ప్రయాణం మొదలెట్టి ముమ్మారు సీఎంగా పనిచేశారు. అలాగే మరో ముమ్మారు ప్రధానిగా నెగ్గి దేశానికి సేవ అందిస్తున్నారు. దాంతో మోడీ పాతికేళ్ళ అధికార రాజకీయ పండుగని ఆయనే స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించి జనాలతో పంచుకున్నారు. దాంతో ఆయనకు దేశవ్యాప్తంగా ఎండీయే రాజకీయ పక్షాల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఎన్డీయేతర రాజకీయ పక్షాల నుంచి చూస్తే కనుక జగన్ నుంచి మాత్రమే మోడీకి గ్రీటింగ్స్ అందాయి.

మెచ్చుకుంటూ మరీ :

మోడీ ప్రజా సేవను ఆయన సుదీర్ఘ ప్రయాణాన్ని మెచ్చుకుంటూ జగన్ ట్వీట్ చేయడం విశేషం. దాంతో దీని మీద ఇపుడు చర్చ అయితే సాగుతోంది. సాధారణంగా ఒక దేశ ప్రధాని ఇలాంటి అరుదైన ఫీట్ ని సాధించిన నేపధ్యంలో ప్రశంసించడంలో తప్పు అయితే లేదు. ఎవరైనా చేయవచ్చు. కానీ ఏపీలో రాజకీయం కానీ దేశ రాజకీయం కానీ చూస్తే ఆ విధంగా అయితే లేదు. రెండు శిబిరాలుగా మారి హోరా హోరీ పోరుగా అంతటా సాగుతోంది. ఈ



నేపధ్యంలో జగన్ ట్వీట్ మాత్రం రాజకీయంగానూ చర్చగానే ఉంది. మోడీ పట్ల వైసీపీ అభిమానం అలాగే ఉందా అన్న సందేహాలను కూడా వ్యక్తం చేస్తోంది. వాస్తవంగా చెప్పాలీ అంటే వైసీపీ జాతీయ స్థాయిలో ఏ కూటమిలో లేదు, ఎన్డీయే కానీ ఇండియా కానీ ఆ పార్టీ చూపు అయితే వాటి మీద లేదు. అయితే సనర్భం వస్తే మాత్రం ఎన్డీయే వైపే చూపు ఉంటుందని అంటున్నారు. దానికి అనేక ఉదాహరణలు ఉంటే ఇపుడు ఈ ట్వీట్ కూడా జత చేరిందని అంటున్నారు.

కూటమికి కంఫ్యూజన్ :

ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ ఇలా ఎన్డీయే సారథి కేంద్ర స్థాయిలో ప్రధాని అయిన మోడీని గ్రీట్ టో కన్ను గీటడం అంటే కూటమికి కంఫ్యూజన్ గానే ఉంటుంది అని అంటున్నారు. అదే సమయంలో రాజకీయాలు ఎపుడూ డైనమిక్ గా ఉంటాయి. ఇవి పరిస్థితులు అవసరాలు ఇచ్చి పుచ్చుకోవడాల మీదనే ఆధారపడి ఉంటాయి. బీజేపీ వరకూ చూస్తే కేంద్ర పెద్దలకు ఏపీలో ఏ పార్టీని దూరం చేసుకునే ఆలోచన లేదని అంటున్నారు. ఎందుకంటే వారి ఆ అగత్యం కూడా లేదని అంటున్నారు జాతీయ స్థాయిలో తమ రాజకీయ ప్రభ వెలగాలి అంటే వచ్చిన వారిని తమను నచ్చిన వారిని ఆకర్షిస్తూనే పోతారు అని అంటారు. దానికి గతంలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. మరి ఏపీ రాజకీయం చూస్తే అలాంటి చదరంగం ఏమైనా ఉంటుందా అంటే ఏమో రాజకీయం అంటేనే అలాంటిది. ఎవరు చెప్పగలరు అన్నదే దానికి అచ్చమైన జవాబు.

# నితీష్ ఉప ప్రధాని?: బీజేపీ భారీ స్కెచ్!?



బీహార్,బీహార్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు వచ్చే అవకాశం కనిపిస్తోంది. 243 అసెంబ్లీ స్థానాలు ఉన్న అతి పెద్ద రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. అధికారంలోకి వచ్చేందుకు అనుకూ ల సమీకరణలన్నీ పరిశీలిస్తోంది. ఇప్పటికే ఎన్డీయే కూటమిగా సుశాన్‌బాబు(మంచిపాలనా దక్షుడు)గా పేరున్న సీఎం నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూతో జట్టుకట్టిన కమల నాథులు.. ప్రస్తుత ఎన్నికల పర్వంలో తమ సత్తా చాటేందుకు ప్రయత్ని స్తున్నారు. అయితే.. అధికారంలోకి రావడం ఖాయమని భావిస్తున్న కమల నాథులు.. కీలకమైన సీఎం సీటుపైనే కన్నేశారు.ఎందుకంటే.. ఎంత అధికారంలోకి వచ్చినా.. ముఖ్యమంత్రి పీఠమే కీలకమన్న విషయం తెలిసిందే.మహారాష్ట్రలోనూ శివసేన (షిండే)తో జట్టుకట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ ముఖ్యమంత్రి పీఠంపై మంకుపట్టుబట్టి.. చివరకు ఆయనను ఒప్పించి. డిప్యూ టీ సీఎం పదవికి పరిమితం చేసింది. ఈ క్రమంలోనే బీజేపీ నేత, మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చో బెట్టింది. ఇప్పుడు ఇదే ఫార్ములలో బీహార్‌లోనూ రాజకీయాలు చేయాలని అనుకున్నా.. సుశాన్ బాబు అంత తేలికగా ఒప్పుకొనే ఘటం కాదు. పైగా తన సొంత సామాజిక వర్గం  కూడా నితీష్‌ను డిప్యూటీ సీఎంగా చూడాలని అనుకోవడం లేదు.అలాగని నితీష్‌తో వైరం పెట్టుకుంటే.. కేంద్రంలోనే కూలిపోయే ప్రమాదం కమల నాథులను వెంటాడుతోంది. ప్రస్తుతం 12 మంది ఎంపీలే నితీష్‌కు ఉన్నా..వారు లేకపోతే.. మోడీ సర్కారు డోలాయమానంలో పడుతుంది. కాబట్టి.. సీఎం సీటుపై బీజేపీకి ఆశలు ఉన్నా.. దానిని దక్కించుకునేందుకు మాత్రం నేరుగా ఢీ అంటే చపల చిత్తుడైన నితీష్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఆశ్చర్యం లేదు. ఈ నేపథ్యంలో బీజేపీ కోరిక నెరవేరాలంటే.. ముందున్న ఏకైక మార్గం.. ఒక్కటే. అదే.. నితీష్‌ను జాతీయ రాజకీయాల్లోకి తీసుకుని.. ఆయనకు దీటైన పదవిని అప్పగించడమే!. అది కూడా.. నితీష్ గౌరవానికే కాదు.. కుర్మి సామాజిక వర్గానికి కూడా మేలు చేసేలా ఉండాలి.ఈ క్రమంలోనే ఉప ప్రధాని పోస్టుకు నితీష్ పేరును పరిశీలిస్తున్నట్టు బీజేపీ జాతీయ వర్గాల్లో అంతర్గత చర్చ సాగుతోంది. తాజా గా ఈ విషయంపై ఒక నిర్ణయం తీసుకునే దిశగా ప్రధాని స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని అంటున్నారు. దీనికి ఎలానూ.. నితీష్ ఓకే చెప్పే అవకాశం ఉంది. ఎందుకంటే.వయసు రీత్యా, అనారోగ్య సమస్యల రీత్యా..ఆయన సీఎంగా కంటే కూడా.ఉప ప్రధానిగా ఉంటే కొంత వరకు నెట్టుకురావడం తోపాటు.. దేశ వ్యాప్తంగా కూడా పేరు మార్మోగుతుంది. ఇదేసమయంలో బీజేపీతో కలిసి అధికారంలోకి తన కుమారుడు లేదా కుమార్తెను తీసుకువచ్చి.. ఉప ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టే అవకాశం కూడా ఉంటుంది.ఏతావాతా ఎలా చూసుకున్నా అటు బీజేపీకి,ఇటు నితీష్‌కు కూడా ఉభయ కుశలోపరిగా ఉంటుందన్న వాదన బలంగా వినిపిస్తోంది. అంతేకాదు.. నితీష్‌ను ఉప ప్రధానిగా ప్రకటిస్తే.. ఆయన వర్గంతోపాటు.. మహిళలు కూడా బీజేపీ కూటమికి పూర్తిగా మద్దతు ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ కూడా సాగుతోంది. సో.. ఎలా చూసుకున్నా.. రాజకీయాల్లో వ్యూహాలు అలానే ఉంటాయి మరి. ఏదైనా జరగొచ్చు. చూడాలి మరి మోడీ మంత్రాంగం.. నితీష్ తంత్రాంగం ఎలాంటి కీలక మలుపు తిరుగుతుందో!.

# బీహార్ దంగల్: ఎంఐఎం దారెటు?



హైదరాబాద్,ఎంఐఎం.. హైదరాబాద్‌కు చెందిన మజ్లిస్ పార్టీ. అయితే.. జాతీయ స్థాయిలో ఈ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చక్రం తిప్పుతున్నారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా.. నేనున్నానంటూ ముందుకు వస్తున్నారు. యూపీ, బీహార్, ఢిల్లీ సహాఈ ఏడాది జరిగిన జార?ండ్‌లోనూ పోటీ చేశారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ముస్లింలను ఐక్యం చేయడంతోపాటు.. కీలకమై న పార్టీలకు కంట్లో నలుసుగా మారుతున్నారు. ఇక, ఇప్పుడు కీలకమైన బీహార్ ఎన్నికలు వచ్చాయి. అయితే.. ఇక్కడ ఎంఐఎం ఏం చేస్తుందనేది చూడాలి. దీనికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి.

1) మహాఘట్ బంధన్‌లో చేర్చుకోకపోవడం: బీహార్‌లో కాంగ్రెస్ నేతృత్వంలో ఆర్జేడీ, సీపీఎం, సీపీఐ చిన్న చితక పార్టీలు కలిసి మహాఘట్ బంధన్‌గా ఏర్పడ్డాయి. అంతేకాదు.. కొన్నాళ్లుగా ఇక్కడ ప్రచార పర్వం కూడా నిర్వహిస్తున్నాయి. అయితే.. అప్పట్లో మేము మీతో కలిస్తాంటూ.. ఎంఐఎం అధినేత ఒవైసీ కాంగ్రెస్‌కు కబురు పంపారు. దీనికి ఆర్జేడీ సుముఖంగానేఉంది. ఎందుకంటే.. బీహార్‌లో బలమైన ముస్లింలను ఎంఐఎం ఎప్పటి నుంచో ప్రభావితం చేస్తోంది. కానీ, బ్రాహ్మణ, హిందూ ఓటర్లపై ఎంఐఎం ప్రభావం చూపుతుందన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం విషయంలో ఇప్పటికీ ఏమీ తేల్చలేదు.

2) ముస్లిం ప్రాబల్య సీమాంచల్‌లో పట్టు: ఇక, బీహార్‌లోని సీమాంచల్ ప్రాంతంగా పేర్కొనే చోట.ఎంఐఎంకు బలమైన మద్దతు ఉంది. ఇక్కడ నుంచే గత ఎన్నికల్లో ఐదు స్థానాల్లో విజయం కూడా దక్కించుకుంది.ఈ సీమాంచల్ డివిజన్‌లో పూర్ణియా, కతిహార్,అరారియా,కిషన్‌గంజ్ జిల్లాలు ఉన్నాయి. ఇక్కడ ముస్లింలు 50 శాతానికి పైగా ఉన్నారని గణాంకాలు చెబుతున్నా యి. అంతేకాదు..ఇక్కడ వీరికి ఎంఐఎం తప్ప.. ప్రత్యామ్నాయ ముస్లిం పార్టీ లేదన్న భావన ఉంది.వాస్తవానికి అవామీలీగ్ ఉన్నా.అది బీజేపీతో జట్టు కట్టింది. ఇది ఎంఎంకు కలిసి వస్తోంది. దీంతో సీమాంచల్ లో పట్టును నిలుపుకోవాల్సి ఉంది.

3) పార్టీకి ఉన్న బలం: బీహార్‌లో స్థానిక ముస్లింలే కాకుండా.. జాట్లు కూడా ఎంఐఎంకు మద్దతు పలుకుతున్నారు. గత ఎన్నికల్లో సీమాంచల్ పరిధి దాటి జాట్లు ఉన్న చోట కూడా పోటీ చేసినా.. ఎంఐఎం రెండో స్థానం దక్కించుకుంది. ఈ పరిణామాల క్రమంలో ఎంఐఎం ఇప్పుడు ఒంటరిగా పోటీ చేసేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. కానీ, మహాఘట్ బంధన్ తో కలిస్తే.. కనీసంలో కనీసం.. రెండంకెల సంఖ్యకు బలాన్ని పెంచుకోవచ్చన్నది అసదుద్దీన్ అంచనా. మరి ఏం చేస్తారో చూడాలి.

# పవన్ టూర్ తో ఉప్పాడకు ఊపిరొచ్చినట్టే!

అమరావతి,నిజమే. జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వేస్తున్న నిర్మాణాత్మక అడుగులతో ఉప్పాడకు ఊపిరి వచ్చేసినట్టే. అదేదో ఏడాదో, రెండేళ్లో కాదు శాశ్వతంగా ఉప్పాడ సమస్యకు పరిష్కారం లభించినట్టేనన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దాదాపుగా నెల రోజుల క్రితం ఉప్పాడలో పడిపోయిన కొబ్బరి తోటలను తాను అక్టోబర్ 9న పరిశీలిస్తానని పవన్ గత నెలలోనే ప్రకటించారు. ఆ ప్రకటన మేరకు పవన్ గురువారం కోనసీమ పరిధిలోని ఉప్పాడలో పర్యటించనున్నారు. అనంతరం ఆయన తన సొంత నియోజకవర్గం పిఠాపురంలోనూ పర్యటిస్తారు.ఏటా వర్షాకాలంలో ఉప్పాడ తీరంలోకి సముద్రపు ఉప్పు నీరు చేరిపోతోంది. ఫలితంగా అక్కడి నీరంతా ఉప్పు నీరుగా మారిపోతోంది. ఇక ఈ ఏడాది అయితే భారీ వర్షాలు, వరదలకు ఉప్పాడ తీరంలోని కొబ్బరి తోటలు, ఇతర వాణిజ్య పంటలన్నీ నేలకూలాయి. ఈ తరహా పరిస్థితి ఏళ్ల తరబడి తరచూ కనిపిస్తున్నదే. అయితే ఏ ఒక్క నాయకుడు కూడా ఈ సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే ఈ ఏడాది రైతులు విషయాన్ని పవన్ కల్యాణ్ కు చేరవేయగా%ౌ% పవన్ వెంటనే స్పందించారు. ఉప్పాడ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని అన్నదాతలకు మాటిచ్చారు.మాటిచ్చి మరిచిపోయే నేతలున్న ఈ కాలంలో పవన్ తన పర్యటనకు ముందే అసలు ఉప్పాడ సమస్య పరిష్కారానికి ఏఏ చర్యలు తీసుకోవాలన్న విషయాన్ని నిగ్గు తేల్చేందుకు ఏకంగా ఓ కమిటీనే ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో వ్యవసాయ, సాగునీరు, పర్యావరణ, వాతావరణ శాఖలు, కాలుష్య నియంత్రణ మండలి, కొబ్బరి పరిశోధన సంస్థ ప్రతినిధులను నియమించారు. ఈ కమిటీ ఇప్పటికే ఉప్పాడలో అవిశ్రాంతంగా పర్యటించి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన పలు చర్యలను సిద్ధం చేసినట్టు సమాచారం.ఇక పవన్ పర్యటన విషయానికి వస్తేగురువారం ఉదయం నేరుగా ఉప్పాడ తీరం చేరుకునే పవన్ అక్కడ నాశనమైన కొబ్బరి తోటలను పరిశీలిస్తారు. అనంతరం సముద్రంలో బోటులో ప్రయాణిస్తూ అక్కడి పరిస్థితులను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఉప్పాడలోనే ఆయన అన్నదాతలతో మాట్లాడతారు. ఉప్పాడ సమస్య పరిష్కారానికి



తీసుకోబోయే చర్యలను కూడా ఆయన వారికి వివరిస్తారు. అనంతరం పిఠాపురం వెళ్లనున్న పవన్ అక్కడ పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు.

## ఎపిలో ఐదు వర్సిటీలకు విసిల నియామకం

అమరావతి,రాష్ట్రంలోని ఐదు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆచార్య నాగార్జున వర్సిటీ వీసీగా వెంకట సత్యనారాయణరాజు సమంతపుడి, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీగా తాతా నర్సింగరావు, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ వీసీగా బి.జయరామిరెడ్డి, జేఎన్‌టీయూ (విజయనగరం) వీసీగా వి.వెంకటసుబ్బారావు, యోగి వేమన విశ్వవిద్యాలయం (కడప) వీసీగా రాజశేఖర్ బెల్లంకొండ నియమితులయ్యారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com